యేసుక్రీస్తు అందరికి ప్రభువు ★

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

RNI APTEL / 2006 / 17980
Postal Regd.No. Vsp- 142 / 2015-2017

CHRISTAVANAADU

TELUGU FORTNIGHTLY, REGD. NEWS PAPER

POST BOX NO. : 2, OLD DAIRY FARM POST, ADARSHANAGAR, VISAKHAPATNAM - 530 040. ANDHRA PRADESH, INDIA.
Call : 9346960601, 9490266640.
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

సంపుటి : 9 సంచిక : 17
ఎడిటర్ : వై.కనకరాజు
2015 జూన్ 16-30 పేజీలు : 8

₹:5


PUBLISHED FROM VISAKHAPATNAM

రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము ★

వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును ★ ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు ★

మర్మగర్భ వివరణలు.. అనేక ప్రశ్నలకు.. సందేహాలకు సమాధానాలు ఒకే చోట!

10వ, సంవత్సరం
'క్రైస్తవనాడు'ల్లో
సంచలనం!
ఆర్టికల్స్‌లో..!
లేఖనాల్లోగల మీకు తెలిసిన మర్మగర్భ సంగతులను ప్రచురించుకునే అవకాశం మీకుంది.
సంప్రదించగలరు.. ప్రార్థనలతోను సహకరించగలరు.
- ఎడిటర్




ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నాడు మరణ పర్యంతము ఆయన మనలను నడిపించును. ★ ఆయన నా దేవుడు ఆయనను వర్ణించెదను ★

**దేవుడైన యెహోవా కరుణా వాత్సల్యములు గలవాడును, శాంతమూర్తియు, అత్యంత కృపగలవాడు... ★**

ప్రపంచ చరిత్రలో నేటివరకు శాంతమూర్తులుగా పేరెన్నికగన్న వారు అతి తక్కువగానే కనబడుతున్నారనేది వాస్తవదూరం కాదు. కొందరు తమ బ్రతుకులలో ముందు చెడ్డవారుగా కనబడినను తరువాత కాలంలో శాంతమూర్తులుగా జీవించినట్లు చరిత్రలో చూడగలం. శాంతమూర్తులుగా లోకాన ఎందరు గుర్తింపబడినను వారందరిలోను శాంతమూర్తిగా మన ప్రభువైన యేసుక్రీస్తుదొక ప్రత్యేక శైలిగా గుర్తించవచ్చు. ఒక వ్యక్తిని ఎవరైనా శాంతమూర్తిగా గుర్తించాలంటే ఆ వ్యక్తిలో ఎన్నో ప్రత్యేకతలు కనబడాలి. అయినను లోకులచే శాంతమూర్తిగా గుర్తింపబడుట కష్టం. మన ప్రభువైన యేసుక్రీస్తును శాంతమూర్తియని నిరూపించు లేఖనాలను బైబిలునందు చూస్తూ తెలుసుకుందాం. మొదట్లోనే బైబిలు వచనాన్ని చదవారు.ఆ వచనం దేవునికి వర్తిస్తుందంటే ఆస్తికులకు అభ్యంతరం ఉండదు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తుకు కూడా ఆ లేఖనం వర్తిస్తుందని మనం నమ్ముతాం.

2



అనుభవంకాదు కావాల్సింది 'జ్ఞానం కావాలి!

-స్వామి సుందర చైతన్య
హైద్రాబాద్



మనం అడుకోడ్డానికి చేయిచాపకూడదు. ఇవ్వడానికే చేయి చాపాలి

- సామ్యూల్ ఆర్. పట్టా
హైద్రాబాద్



పెట్టేవాడి చేతిని పరమాత్ముడు ఎప్పుడూ వదలడంటారు!

- చలపతి రావు
(ఓనమాలు చిత్రంలో)

ఆంధ్రప్రదేశ్ NORTH EAST WEST SOUTH తెలంగాణ

## 'ఓటుకు కోట్లు'... పట్టుబడిన వారిని క్రైస్తవులనొచ్చా?!



బిషప్ హ్యారీ సెబాస్టియన్



యెరూషలేము మత్తయ్య

టీ తెదేపా నాయకుడు రేవంత్‌రెడ్డితోబాటు దొరికిన బిషప్ హ్యారీ సెబాస్టియన్‌లతోబాటు యెరూషలేము మత్తయ్యల ప్రమేయాన్ని రెండు రాష్ట్రాల క్రైస్తవులు తప్పుపడుతున్నారు. 'లంచం ఇవ్వొద్దన్న దేవుని వాక్యాన్ని' తుంగలోతొక్కే వారెవరూ క్రైస్తవులు కారని వారంటున్నారు. అలాగే 'నీ ప్రజల అధికారిని నిందించవద్దన్న దేవుని మాటనీ' వారు ఖాతరు చేయకపోవుట వాక్యానికి వ్యతిరేకమంటున్నారు. ప్రజా నాయకుల్ని ఇష్టానుసారంగా ఎద్దేవా చేయుట తగదనీ హితవు పలుకుతున్నారు. ఎన్నో విధాల దేవుని మాటల్ని తృణీకరించే వీరు బోధలు చేసే వారిని, డిబేట్‌లలో పాల్గొనే వారని విని ఇలాంటి వారు అందుకు పనికిరారని చర్చించుకుంటున్నారు. దేవుని గురించి చెప్పేవారి బ్రతుకుల్లో ఆ యా మాటల నెరవేర్పు లోకస్తులు స్పష్టంగా చూడగలగాలి. లేకుంటే దైవోగ్రతకు పాత్రులై ఆ ఉగ్రతను చవిచూస్తారని, అందుకు మరో ప్రత్యక్ష సాక్ష్యంగా 'ఓటుకు కోట్లు' కేసు కన్పిస్తోందని క్రైస్తవ బోధకులు, నాయకులు రెండు రాష్ట్రాల్లోను చర్చిస్తూ విశ్వాసుల్ని జాగ్రత్తపడమంటున్నారు. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వమేవిధంగా ముందుకెళ్లనుందో వేచి చూడాల్సిందే!

అర్జెంట్ రిక్వైర్డ్

## లేడీ టీచర్స్ కావలెను

విశాఖజిల్లా మజ్జివలస (తగరపువలస దగ్గర)లో ఉన్న ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పనిచేయుటకు ఆసక్తిగల 'లేడీ టీచర్స్' కావలెను. తక్షణం సంప్రదించగలరు.

ఫోన్స్ : 08933-227533 / 227588

## జ్ఞానమార్గ ఆరాధన : డా.గరికపాటి

**'జ్ఞాని' గొప్పదనాన్ని వివరిస్తూ ఓ చానల్లో డా.గరికపాటి ఇలా అన్నారు...**



● కోరికల కోసమే భగవంతుని దగ్గరకొచ్చేవారు వ్యాపారస్తులే ● 'భజ' అంటే భజన చేయుటకాదు, సేవించుటని అర్థం ● భక్తి మార్గమెప్పుడు జ్ఞానమార్గం కానేరదు. భక్తిమార్గం కంటే కోటిరెట్లు గొప్పది జ్ఞానమార్గం. ● భక్తుల్ని దేవుడు కాపాడుతాడు. జ్ఞాని ఆయన్ని కాపాడుతాడు. ● 'జ్ఞాని' భగవంతుడు ఒక్కటే ● జ్ఞాన మార్గ ఆరాధనలోనున్న వారు కోకిలవంటివారు. భౌతిక ఆరాధనలోనున్నవారు కాకులవంటివారు. ● కోకిల గుంపు : సజ్జనులు, కాకుల గుంపు : దుర్జనులు

'క్రైస్తవనాడు' పేపరు 10వ, సంవత్సరంలో ప్రవేశిస్తున్న సందర్భాన ప్రార్థనలతో ఆర్టికల్స్‌తో, ఆడ్వర్టైజ్‌మెంట్స్‌తో సహకరిస్తున్న అందరికి

**మా హృదయపూర్వక కృతజ్ఞతలు!**

10వ,సంవత్సరంలో..వెలువడే 'క్రైస్తవనాడు' సంచలనం! పేపర్లలో.. మీరూహించని, ఎన్నడూ వినలేని బైబిలుకు సంబంధించిన మర్మ గర్భ వివరణలు, వాటి భావములను పాఠకులకు అందించనున్నాం. అనేక వాక్య వివరణలకు సంబంధించిన దుర్బోధలను ఖండిస్తూ సత్యమేంటో నిర్ద్వంద్వంగా నిరూపించనున్నాం. వాటిలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పేరెన్నికగన్న బోధకుల వివరణలు ఉంటాయి. 'క్రైస్తవనాడు' పేపరు అభివృద్ధి కోసం మీ మీ కుటుంబ ప్రార్థనలలో గుర్తుచేసుకుంటున్న మీ అందరికి కృతజ్ఞతలు!

– బ్రదర్ వై.కనకరాజు మరియు 'క్రైస్తవనాడు' కుటుంబీకులు
(ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలు)


ఏ భార్య అయితే భర్తకు లోబడదో, ఏ భర్త అయితే భార్యను ప్రేమించదో ఆ కొంప కొల్లేరవుతుంది. భర్తకు లోబడక ఎదిరించే భార్య తన పిల్లలచే ఎదిరింపబడుతుంది. అందుకు కారణం - తాను భర్తను ఎదిరించుటే. దాన్ని ఆమే తన పిల్లలకు నేర్పిందని గ్రహించుకోవాలని ఓ టీవి చానల్లో మాట్లాడుతూ బ్రదర్ సతీష్ కుమార్ భార్య భర్తల మధ్య ఉండాల్సిన బంధాన్ని వివరించారు.



వృద్ధాప్యం మానవులకు శాపం కారాదు 2
నిత్యకృత్యం 3
యాత్రికుని ప్రయాణం 4
డబ్బుందా.. అయితే మీరే బోధకులు ! 5
..సాతాను విత్తిన గురుగులు! 6
దురభిమాన పాపము 7
విశ్వాసి – విధేయత 8
అకారాది వాడుక శబ్దార్థాలు 8

సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము ★

కాబట్టి ఆయన శాంతమూర్తియని తెలియజేస్తుంటాం. ఆ అంశాలకు సంబంధించిన లేఖనాలను ధ్యానిస్తూ సాగుదాం! అంతకుముందే మనుష్యులు శాంతమూర్తులుగా ఎప్పుడు గుర్తించబడతారన్నది కాస్త ఎరుగుదాం. అందుకు ఎన్నో విషయాలు ఆలోచించాలి.




ఎవరినైనా ఇంకొకరు కొంత బాధిస్తే భరించగలరు. కొంత విమర్శను తట్టుకోగలరు. కొంత దూషణను సహించగలరు. ఈ విధంగా ప్రవర్తిస్తే సహించేంత శాంతము ఎందరికి ఉంటుంది? ఆలోచించాలి! బాధించుటను, విమర్శించుటను, దూషించుటను అతిగా అనుభవించినను శాంతముగా భరించిన వ్యక్తే మన ప్రభువైన యేసుక్రీస్తు. చరిత్రలో అనేకుల జీవితాలను మనం విశ్లేషిస్తే యేసుక్రీస్తు జీవితం ఎంతో భిన్నంగా కనబడ్తుంది. ఎవరూ అనుభవించనటు వంటివెన్నో శ్రమలు ఆయన బ్రతుకుకాలంలో అనుభవించారు. అయినా ఎవరినీ ఏమీ అనని శాంతవర్తనునిగా బైబిలు నందు ఆయన కనబడతారు. ఎవరైనా పొగడ్తలను ఎక్కువగా ఇష్టపడతారు. ఆ పొగడ్తలు కూడా అతి అయితే ఖండించగలగాలి. అలా ఖండిచలేని మనోదౌర్భల్యం వారిని నలుగురిలో నగుబాటుకు లోనుగావిస్తుంది.

యేసుక్రీస్తు యొద్దకు దయ్యము పట్టిన ఒక మూగవానిని తీసుకొని కొందరు వచ్చారు. ఆయన వానిని బాగు చేశారు. దీన్ని చూసిన ఆనాడు అక్కడున్న జనసమూహములు ఆశ్చర్యపడితే పరిసయ్యుల తెగవారు మాత్రం ఆయనకు వ్యతిరేకులయ్యారు. దయ్యములకు అధిపతియని అందు కారణంగానే ఆయన దయ్యములను వెళ్ళగొట్టుచున్నాడని యేసును గురించి అన్నారు.

ఈ సంగతి బైబిల్లో చదవగలం. యేసు చేసినది ఒక గొప్ప ఉపకారం. అయినా దెయ్యాలకు అధిపతియని ఆయనకు వారు పేరుపెట్టారు. మనమే అటువంటి పనిచేస్తే ఎవరైనా మనల్ని అలా అంటే ఊరుకుంటామా? ఆలోచిం చండి! ఆయన 'శాంతమూర్తి' కాబట్టే ఊరుకున్నారు.

అలాగే సువార్తా ప్రయాణంలో కానాను స్త్రీ యేసుక్రీస్తు యొద్దకు వచ్చి తన కుమార్తెకు పట్టిన దయ్యాన్ని వదిలించమని వేడుకుంది. తన కుమార్తె బహుబాధపడుచున్నదనీ విన్నవించింది. ఆయన ఆమెతో ఒక మాట కూడా మాట్లాడలేదు. ఆయన శిష్యులు ఈమె మన వెంట వస్తూ గోల చేస్తుంది కాబట్టి ఈమెను పంపివేయాలని చెప్పారు. ఆయన దేవునిచే ఇశ్రాయేలు యొద్దకే పంపబడ్డారని నిరంతరము జ్ఞాపక ముంచుకొన్నవారు కాబట్టి కానాను స్త్రీతో ఏమీ మాట్లాడలేదు. ఆవిధంగా ఆమెయెడల శాంతము చూపి లేఖనాలలో గల దేవుని మనస్సును గౌరవించారు. అయినను కానాను స్త్రీ ఆయనకు మ్రొక్కి మరల మరల అడుగుచుండగా తన శిష్యులు విసిగినట్లు ఆయన విసుగలేదు. అమ్మా నీ విశ్వాసము గొప్పది అన్నారు. నీవు కోరినట్టే నీకు జరుగుతుందని చెప్పారు. ఆ క్షణంలోనే ఆమె కుమార్తె బాగుపడినట్లు బైబిలునందు వ్రాయబడింది.

ఆయన వెనుకనున్న శిష్యులు విసిగినను, ఆయన విసుకక ఆమె కుమార్తెను స్వస్థపరిచారు. కేకలు వేస్తూ విసిగించినామెను మన ప్రభువైన యేసు అమ్మా అని పిలిచారు. ఆయన ఎంత గొప్ప 'శాంతమూర్తో'!

యూదులు విశ్రాంతి దినమున ఏ పనీచేయని ఆచారము గలవారిగా బైబిలు నందు కనబడతారు. ప్రభువైన యేసుక్రీస్తు కూడా యూదులే. విశ్రాంతి దినాన యేసు అప్పటికి 38 సంవత్సరముల నుండి వ్యాధితో బాధపడుచున్న ఒకని స్వస్థపరిచారు. అది విశ్రాంతి దినమగుటవల్ల ఆచారములకు విలువచ్చే యూదులు దాన్ని తప్పుగా భావించారు. స్వస్థపడిన వాడు యేసునుగూర్చి, ఆయన తనకు చేసిన మేలును గూర్చి చెప్పసాగెను. ఇందు నిమిత్తమై వారందరును యేసును హింసించారు. అయినను యేసు తన శాంతమును వారికి చూపి 'శాంతమూర్తి'గా తన్ను తాను బయల్పరచుకొన్నారు. వారాయనను హింసిస్తే ఆయనేమో దేవుని కార్యాలను గూర్చి వారికి వివరించారు.

విశ్రాంతి దినాన పని చేయుట తప్పుకాదని నిరూపించుటకు ఆయన తన తండ్రియైన దేవుని గూర్చి బయల్పరచారు. దేవుడు పనిచేయుచున్నారని, ఆలాగుననే కూమారుడైన నేనును పనిచేస్తున్నానని తెలియజేశారు. చిరాకుపడినట్లుగాని, వారిపై కోపపడినట్లుగాని బైబిల్లో దీని గురించి చూడలేము.

పుట్టు గ్రుడ్డియైనవానిని, ఆయన బాగుచేసి చూపునిచ్చారు. ఆ గ్రుడ్డివాడు బిక్షగాడు. ఈ విషయమై షరామామూలుగానే పరిసయ్యుల తెగవారు యేసును దూషించారు. యేసుతోపాటు ఈసారి ఆ బిక్షగాన్ని కూడా దూషించారు. గ్రుడ్డివాని సాక్ష్యం బలంగా ఉండుట వల్ల ఆయన్ను వారేమి అనలేకపోయారు. గ్రుడ్డివాన్ని మాత్రం నీవు కేవలము పాపివై పుట్టినవాడివన్నారు. యేసు కూడా పాపియని మేమెరుగుదుము అని అన్నారు.

అయినను ప్రభువు వారినేమి అనలేదు. దేవుడు తనకప్పగించిన కార్యములను సంపూర్తిచేయుటకై ముమ్ముందుకెళ్లినట్లు చదువగలం.ఆయనెల్లప్పుడు దేవుని కార్యాలయందే ఆసక్తి కనబర్చుచు వారందరియెడల 'శాంతమూర్తి'గా అగుపడెను.

సిలువలో ఉన్నప్పుడైతే ఆయనకు ఇరువైపుల ఉన్న దొంగలు సహితం ఆయనను దూషించారు. అయినాసరే వారిలో ఒకని ఆయన రక్షించినట్లు చూస్తాం. రక్షణ ప్రసాదించి తనతోపాటు పరదైసులో ఉండే భాగ్యాన్ని కూడా అనుగ్రహించినట్లు చూస్తాం. అంతటి శాంతమెవ్వరికి సొంతం? మన ప్రభువైన క్రీస్తుయేసుకు తప్ప!.

సిలువకు ముందు ముండ్ల కిరీటము అల్లి ఆయనకు పెట్టి యూదులరాజా, నీకు శుభమని చెప్పి ఆయనకు వందనము చేసారు. రెల్లుతో ఆయన తలమీద కొట్టారు. ఆయన మీద ఉమ్మి వేసారు. మోకాళ్ళూని ఆయనకు నమస్కరించి అపహసించారు. ఆయనను ఎన్నో విధాలుగా అపహసించినా ఆయన శాంతమే కనబర్చి మాబోటి వారిచే 'శాంతమూర్తి' అన్పించుకున్నారు.

యేసును సిలువ వేస్తున్నప్పుడు సిలువేసిన వారందరిని గూర్చి తండ్రియైన దేవునిని 'తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక క్షమించుమని' ఆయన వేడుకున్నారు. వారింకా యేసునుగూర్చి మాట్లాడుతూ, ఎందరినో రక్షించెను తన్నుతాను రక్షించుకొనలేడా అని అపహసించారు. నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనమని గేలి చేసారు. వారెన్ని విధాలుగా తనను అపహసించినా గేలిచేసినా ఆయన వారిని గూర్చి ప్రార్థించారు. ఆలోచిస్తే ఇది మనుష్యులకు సంభ్రమాశ్చర్యం కలిగించక మానదు. యేసు ఇంత గొప్ప 'శాంతమూర్తా' అని గ్రహించకమానరు.

బైబిలు చరిత్రకు సాక్షి. ప్రపంచానికి సంబంధించిన తొలి సంభవాల నుంచి కూడా అందరికి సులువుగా తెలిపేదే బైబిలని ప్రకటించుట దేవునిలో మనకాశీర్వాదం. బైబిలు చదివి, గ్రహించిన వారికి ఆ సంగతి సులువుగానే అవగాహనౌతుంది. అట్టి చారిత్రక గ్రంథంగా పరిగణింపబడు బైబిలునందు క్రీస్తును 'శాంతమూర్తి'గా ఘనపర్చుటకు ఇటువంటి వివరణలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్నిటిని మీ ముందుకు తీసుకొచ్చాం. 'క్రైస్తవనాడు' పేపరు కొరకు ప్రార్థించుడి.

**క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమపరుస్తున్నప్పుడు మనలో కొందరిలా ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇందుకు భిన్నంగా చాలామంది ఇతరుల గ్రంథాలు, విశ్వాసుల జోలికెళ్తూ వివాదాలకు కారణమౌతున్నారన్నది వింటున్నాం. ఇది లేఖన వ్యతిరేకమన్నది బైబిల్లో పట్టున్నవారిమాట. లోపల పేజీల్లో బైబిలుకు సంబంధించిన అనేక వివరణలు ఇస్తూ విశ్వాసులను కాపర్లను బలపరుస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. అందెట్టి సందేహాలు, ప్రశ్నలున్నా కార్యాలయానికి ఉత్తరం వ్రాయండి. మీరు వ్రాసిందాన్నిబట్టి మరింత వివరణ తదుపరి పేపర్లలో ఇస్తాం.**

**-ఎడిటర్**

# వృద్ధాప్యం మానవులకు శాపం కారాదు



పి.ఇమ్మానుయేలు,
చీఫ్ మేనేజరు(రిటైర్డ్)
భారతీయ స్టేట్ బ్యాంక్, విశాఖ.

నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు ధీర్ఘాయు ష్మంతుడ గునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము. నిర్గమాకాండం 20:12

దూరంగా ఒక కాకి కూర్చొని ఉంది. దానికి ఆకలిగా ఉంది. చావడిలోని ముసలి ఎద్దుకు కూడా ఆకలిగానే ఉంది. ఎద్దు నోటికి హితంగాచ, అంత పచ్చగడ్డి కావాలి.. దొరకదు. కాకికి ఎద్దు వెన్నుమీద ఉన్న పుండు కావాలి.. దొరుకుతుంది. కాకి పొడిచినప్పుడు ఎద్దుకు బాధగా ఉంటుంది. నొప్పిగా ఉంటుంది. పౌరుషంగా ఉంటుంది. అంతలోపే ఏడుపు కూడా ఉంటుంది.

ఇప్పుడది పనిచేయలేని ముసలి ఎద్దు- వ్యవసాయానికి పనికిరాని ఎద్దుకావచ్చుకాని ఒకప్పుడు ఆ ఎద్దు ఎలా బతికింది రాజులా బతికింది. దాని యజమాని దానిని చూసి గర్వ పడేవాడు. దానికి తోడుగా జత ఎద్దును తీసుకొనివచ్చి రెండిటినీ బాగా అలంకరించి ఊరంతా ఊరేగించి పొంగిపోయేవాడు. "నా ఎద్దుల శౌర్యాన్ని చూస్తారా? అని బండి మీద పుట్టెడు వడ్ల బస్తాలను వేసి ఆ బరువును చేరువులో ఈ మూలనుంచి ఆ మూలవరకూ నా ఎద్దులు లాగుతాయి చూడండి. అని సవాలు చేసాడు. ఊరు ఊరంతా ఆ పరాక్రమం చూడడానికి జమ అయ్యింది. అంతటా ఉత్సవం- ఎద్దులకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. యజమాని చర్నాకో తోపకముందే అవి అంత బరువును, పుట్టెడు వడ్లను ఈడ్చి అవతల పారేశాయి. ఆ పరాక్రమం నేడు ఆ ముసలి ఎద్దుకు గుర్తుకు వచ్చింది.

ఇవాళ ఆ పరాక్రమాన్ని ఆ యింట్లో గుర్తు చేసుకొనేవారు ఎవరూ లేరు. మురిపెంగా ఆ విషయాన్ని మాట్లాడుకొనేవారూ లేరు. "నా జత ఎద్దు అదృష్టవంతురాలు ముందే చనిపోయింది" అనుకొంది ఆ ఎద్దు.

కాకి మళ్ళీ కావుమంది. ఎద్దు పుండు దానికి రుచి. అదివస్తే? వచ్చి పుండును పొడిస్తే? తోకతో కూడా విసురుకోలేని పరిస్థితి" అని ఎద్దు దీనంగా అనుకొంది. యజమాని దానిని పట్టించుకోడు. ఇప్పుడు అతడి ధ్యాసంతా క్రొత్తగా కొట్టంలోకి చేరిన జోడు ఎడ్లగురించే. వయసు ఉండి కళకళలాడుతున్న ఆ జోడు ఎడ్లను చూసి అతడు మురిసిపోతున్నాడు. తనని చూసి? రోత పడుతున్నాడు.

ఒరేయ్!.. అప్పుడే మర్చిపోయావా? నేను నీ దగ్గరకు వచ్చిననాడు నువ్వు ఉత్త పది ఎకరాల అసామివి... ఇవాళ? యిరవై ఎకరాలకు కామందువి... నా రక్తమాంసాలను ఏకం చేస్తేనే కదరా అవినీకు వచ్చింది? అనుకొంది ఆ ఎద్దు. కాని ఆ మాటను ఆ యింట్లో ఎవరు అనుకొంటారు? ఎవ్వరూ అనుకోరు. ఆ యింట్లో కుక్కిమంచంలో కూచుని ఉన్న యజమాని తండ్రి తప్ప.

ఆయన పనికూడ అయిపోయింది. కుటంబం కోసం తన శక్తిని ధారపోసీ ధారపోసీ అంతా ఆవిరి అయిపోయింది. ఇవాళ ఆ ముసలాయన వల్ల ఆ కుటుంబానికి ఎటువంటి లాభంలేదు. అందుకే అతడిని మూల కూర్చోపెట్టారు. మూలనే ఉంచేశారు. కొడుకు పట్టించుకోడు. కోడలు సరిగ్గా అన్నం పెట్టదు. పిల్లలకి తాత అంటే గౌరవంలేదు. గౌరవం కలిగించే మాటలు పిల్లలతో చెప్పాలని ఆ తల్లిదండ్రులకు లేదు.

అప్పుడప్పుడూ ఆ ముసలాయన, ఎవరూలేని సమయం చూసుకొని ముసలిఎద్దు దగ్గరకు వచ్చి కన్నీళ్ళు పెట్టుకుంటాడు. నీ బాధనాకు తెలుసు అన్నట్లుగా చూస్తాడు. ఆ మాటకొస్తే ఆయన బాధమాత్రం ఆ ముసలి ఎద్దుకు తెలియదా?

అదిగో ఆ ముసలాయన్ని కాకిలా పొడవడానికి ఆయన కోడలు వస్తోంది. ఎద్దుకండను పొడవడానికి కాకిరెక్కలు ఆడిస్తోంది. అబ్బా ఎంత బాధగా ఉంటుందో.

వయస్సు మళ్ళిన ఎద్దులను కొనేందుకు కబేళాలు ఉన్నట్టు వయస్సు మళ్ళిన తల్లిదండ్రులను కొనే కబేళాలు లేవు. ఒకవేళ ఉంటేగింటే మనిషి జాతి నిర్మొహమాటంగా వారికి తమ తల్లిదండ్రులను తరలించగలరని దశాబ్దాలు క్రితమే శాస్త్రజ్ఞులు హెచ్చరించారు. దశాబ్దాలు గడిచిపోయాయి. అదృష్టవశాత్తు అలాంటి కబేళాలు రాలేదు. కాని వాటికి బదులుగా ఓల్డ్ ఏజ్ హోమ్‌లు, వృద్ధుల శరణాలయాలు, కన్న బిడ్డలు ఉండగా కూడా అనాధలుగా చనిపోయేవారికి దహన సంస్కారాలు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి.

మనం పుడితే నిద్ర మానుకొని జోలపాడి, నిద్ర పుచ్చిన తల్లిదండ్రులు, మనకు జర్వంకాస్తే వాళ్ళ వళ్లు వెచ్చబడ్డ తల్లిదండ్రులు, మనకు దెబ్బ తగిలితే వాళ్ళ కళ్లల్లో నీళ్లు ఉబికే తల్లిదండ్రులు, ఎన్ని ఆశలు పెట్టుకొని, ఎన్ని ఆత్రాలు పెట్టుకొని, ఎన్ని అపురూపాలు అల్లుకొని బిడ్డలను సాకి తరించి ఉంటారు. ఇవాళ వయసు ఉడిగినంత మాత్రాన వారు కానివారౌతారా?

ఇప్పుడు మనం తప్పకుండా రాయి తీసుకొని కాకిని ఎగరగొట్టాలి. ముసలి తల్లి దండ్రుల చేతిలోని ఊత కర్రలను అవతల పారేసి మన భుజాన్ని అసరాగా యివ్వాలి. ప్రతి పండుగ కాలంలోను మన పెద్దల ఒడిలో క్రొత్త బట్టలు పెట్టి కృతజ్ఞతా పూర్వకంగా వారికి నమస్కరించాలి. అలా చేస్తేనే మానవులం, చేయకపోతే? దానవులం!!!

**టిప్స్**

* నిమ్మచెక్కను మిక్సీలో వేసి మెత్తగా చేసి దానికి కొద్దిగా తేనె, ముల్తానీ మట్టి, కాసిని నీళ్లు చేర్చి ముఖం, మెడ, చేతులకు రాసి అది ఆరాక గోరువెచ్చటి నీళ్లతో కడిగితే చర్మం మీద మృతకణాలు తొలగిపోయి కాంతిమంతంగా తయారవుతుంది.
* రాగి గిన్నెల అడుగుభాగంలో టమాటా సాస్‌తో రుద్ది కొద్దిసేపయ్యాక కడిగేస్తే అడుగున ఉన్న పదార్థాల తాలూకు మరకలు వదిలిపోతాయి.
* పచ్చిబఠాణీలు ఉడికించేటప్పుడు అందులో కొద్దిగా వెనిగర్ జోడిస్తే అవి రంగుమారవు.
* స్నానాల గదిలోని సిరామిక్ పలకలను మైనంలో రుద్ది కాసేపయ్యాక నీళ్లతో కడిగితే శుభ్రపడతాయి.
* గోడలపై పడ్డ పెన్సిల్, పెన్ను మరకలు పోవాలంటే పాలలో ముంచిన శుభ్రమైన వస్త్రంతో తుడిస్తే సరి.
* అరటి, బంగాళదుంప ముక్కల మీద ఉప్పనీళ్లు చల్లి పావుగంటయ్యాక వేపుడు చేస్తే... ముక్కలు బాగా వేగుతాయి.
* వెల్లుల్లి రెబ్బల్ని గంటపాటు నీళ్లలో నానబెట్టి పొట్టుతీస్తే సులువుగా వస్తాయి.

# క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



# నిత్యకృత్యం

ప్రతివారి జీవితాన నిత్యకృత్యంగా ఏదో ఓ పని ఉండకమానదు. దాన్ని చేయకా మానరు. అది భక్తి కోసమైనా లేక భుక్తి కోసమైనా కావొచ్చు. దేనికోసమైనా నిత్యకృత్యంగా చేసేదాంట్లో ఎంతో నిజాయితీ చూపాలి. నిబద్ధత కలిగుండాలి. లేకుంటే రాణించదు. ఎవరైనా తాము నిత్యకృత్యంగా చేసేదాంట్లో నిజాయితీ,నిబద్ధతల్లేకుంటే అంతకంతకూ తమ ఉనికిని కొల్పోతారు. ఉంటే దినదిన ప్రవర్ధమానులగుట ఖాయం. భుక్తి కోసం చేసే నిత్యకృత్యాలు తామున్న ప్రాంతంలోనే తమకు ఓ మంచి గుర్తింపు నివ్వొచ్చు... లేదా మరిన్ని ప్రాంతాల్లోనూ గుర్తింపు నివ్వచ్చు. అదే తమ చుట్టూ ఉన్న 'ప్రజలకోసం' తమకున్న పరిధిలోనే ఉపకారులుగా ఉండుట కూడా నిత్యకృత్యాల్లో ఒకటిగా చేసుకొన్నవారు అంతకంతకూ ప్రాంతాలను దాటే కీర్తిని పొందుతారు. ఆధ్యాత్మికంగానైతే దైవచింతనే నిత్యకృత్యంగా గలవారికి తమ బ్రతుకులో సమాధానం ఉంటుంది. అందర్నీ సమభావంతో చూచుట అలవాటై తుదకు తమకున్నదేదైనా దైవ ప్రాసాదితమైనదని, దానిపై సర్వులకూ హక్కున్నదన్న 'నిత్యసత్యాన్ని' గుర్తించగలుగుతారు. తద్వారా తమకున్నదాన్ని, సమకూడుతున్న దాన్ని తమ కోసంగాక ప్రాంతాల పరిధులను దాటే విధంగా వాడుట నిత్యకృత్యంగా చేసుకుంటారు. తద్వారా తమ సేవా తత్పరత లోకానికి చూపుతారు. తోటి వారందరికి సహకారులై విశ్వవ్యాప్త కీర్తి పొందుతారు. 'అందరికి' మార్గదర్శులౌతారు. దైవత్వం యొక్క సర్వపరిపూర్ణతను లోకానికి స్పష్టంగా చూపగలరు. అదే ఆస్తులు పోగేసుకొనుట నిత్యకృత్యంగా చేసుకుంటున్న వారు దైవత్వాన్నే కాదుగాని కడకు మానవత్వాన్ని కూడా తమ బతుకుల్లో చూపలేరు. తర్వాతి వారికి ఆశాంతినే మిగిల్చిపోతారన్నది నగ్నసత్యం. ఉన్నంతలోనే చుట్టూ ఉన్న అక్కరగలవారికి సహకరించుట 'నిత్యకృత్యంగా' తమ బతుకుల్లో చూపేవారే ధన్యులు, దేవునికిష్టులు.

**ఒక్కొక్క మనుష్యుడు తన వివేకముకొలది పొగడబడును ★**

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి" ★

---

ఎడిటర్ కుటుంబికులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వైకె.రాజు, రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండి.

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం



బ్రదర్ వై.లీలా రవిరాజు

బైబిల్ / దేవుని మాట × సైన్స్ శాస్త్రజ్ఞుల / మాట

**మీ దేశమునకు వర్షము, అనగా తొలకరివానను, కడవరివానను దాని దాని కాలమున కురిపించెదను. అందువలన నీవు 'నీ' ధాన్యమును, 'నీ' ద్రాక్షారసమును 'నీ' నూనెను కూర్చుకుందువు. మరియు 'నీవు' తిని తృప్తి పొందునట్లు 'నీ' పశువుల 'నీ' చేలయందు గడ్డి మొలిపించెదను. ★**

భూమి బహుగా ఫలించి మానవజాతి మనుగడ సాగాలంటే ఎలా జీవించాలో దేవుని మాటలలో మునుపటి 'క్రైస్తవనాడు'లో చూసారు. దేవుడు తన పిల్లలైన మనకోసం, మనుగడకోసం బహుజాగ్రత్తలు తీసుకున్నట్లు బైబిలునందున్న అనేక వచనాలు ధ్యానించుట వలన తెలుస్తూ మనల్ని అబ్బురపరుస్తుంటాయి. ఎందుకు దేవునికి మనపై అంత ప్రేమ? ఆయన మనందరికి తండ్రి కాబట్టి. దేవుని ఆజ్ఞలు ధ్యానిస్తూ మన బ్రతుకులు పండించుకుంటే మన బ్రతుకులెలా ఆనందంగా సాగుతాయో లేఖనంలో చూశారు. ఆ లేఖనంలో 'నీ' ధాన్యము, 'నీ' ద్రాక్షారసము, 'నీ' నూనె, 'నీవు' తిని తృప్తి పొందుదువు. 'నీ' చేలయందు, 'నీ' పశువులకు గడ్డి మొలిపించెదనని వ్రాయబడింది. ఎంత గొప్ప ఆశీర్వాదం దేవుడు మనకు ఇస్తున్నారు. పొందుటకు ఇష్టపడువారే ఆయన పిల్లలు. పై లేఖనంలో అంతటా 'నీ' అని వ్రాయబడింది. అనగా మనదైనదాన్నే మనం అనుభవించాలి. పరుల భూమి, పంట కాకూడదని దేవుని వాక్యం చెప్తుంది. మన ఆలోచనలు కూడా 'మా' అన్నమే మేము తిందుము, 'మా' వస్త్రాలే మేము కట్టుకొందుము. 'నీ పేరు' (దేవుని) పెట్టి మా నిందలు తీసివేయుమని దేవునితో చెప్పువారికి ఆయన ఆశీర్వాదం బహువేగంగా లభించునని తెలుస్తుంది. నేటి దినాలలో ఎందరు పై విధంగా సొంత వాటినే అనుభవిస్తున్నారు. ఇతరుల సొమ్మును ఆస్తులను ఎలాగైనా తమ వాటిగా చేసుకొనుటకు ఇష్టపడువారు అనేక చోట్ల కనబడ్తుంటారు. అందువల్లే సమాజంలో శాంతి భద్రతలు కరువగుచున్నాయని మనకు తెలుసు. దేవుని మాటలయందు భయభక్తులతో జీవిస్తే భూమిపై మన బ్రతుకుకాలమంతా సుఖసంతోషాలకు లోటేం వుంటుంది! మనమలా జీవిస్తే భూమి తన ఫలాన్ని మనకు తప్పక ఇస్తుందని దేవుని వాక్యం చెప్తుంది. దేవుని ఆజ్ఞను తూ.చ. తప్పకుండా భూమి తన చుట్టూ తాను తిరుగుటలో కాని, సూర్యునిచుట్టూ తిరుగుటలో కాని, ఎక్కడా క్రమం తప్పినట్లు లేదు. దేవుని ఆజ్ఞను పాటిస్తూ భూమి దేవుని ఘనంగా స్తుతిస్తుంది. మరి మనమో? ప్రతిక్షణం దేవుని ఆజ్ఞలను మీరుతూనే ఉంటున్నామేమో! అందును బట్టియే మానవ జీవితాలలో అశాంతి పెరుగుతుందేమో? మనల్ని మనమే లేఖనం ప్రకారం పరీక్షించుకుంటూ సరిచేసుకుందాం. భూమి దేవుని ఆజ్ఞను పాటిస్తున్నట్లు తద్వారా దేవుని ఆశీర్వాదాలు పొందుచున్నట్లు లేఖన భాగంలో చూద్దామా...

**ఎట్లనగా, భూమి తనమీద తరచుగా కురియు వర్షమును త్రాగి యెవరి కొరకు (మనకొరకే) వ్యవసాయము చేయబడునో వారికనుకూలమైన పైరులను ఫలించుచు దేవుని ఆశీర్వచనము పొందును.★**

పై లేఖనం చదివారుగా.. ఎంతో ఆశ్చర్యం కలిగించుట లేదా? ఆలోచించండి! ఎందుకు భూమికి అంత శ్రద్ధ మనపై అన్పిస్తుంది కదూ. శ్రద్ధ భూమిది కాదు ప్రియులారా, మనందరి తండ్రియైన దేవాది దేవునిది. ఆయనకు మనపై ఉన్న అపార ప్రేమకు పరాకాష్ఠే పై అక్షరసత్యం. కాదనగల ఆధ్యాత్మిక వాదులెవరు? ఉండబోరు సుమా!

**నా వల్ల కాదు : క్రైస్తవులిలా అనొచ్చా?!** సాధారణంగా మనలో అనేకులు తాము చేయవలసిన పనులను గూర్చి 'నా వల్ల కాదు' అనుట వింటుంటాం. దైవోద్దేశ్యంలో ఇది ఎంత మాత్రము సరికాదు. 'నన్ను బలపరచువాని బట్టియే నేను సమస్తమును చేయగలను' ★ అన్నది దేవుని మాట. ఇప్పుడు ఆలోచించండి. క్రైస్తవులెవరైనా నా వల్లకాదని అనొచ్చా? అనకూడదా?

-బ్రదర్ వైకెయార్

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ.

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**
చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 9346960601 / 8885362270 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగవోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

Online A/C : CHRISTAVANAADU, Current A/C : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsha Nagar Branch, Visakhapatnam - 530 040
IFSC Code : ANDB0001396

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Call : 8885362270

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU, 18-441/5
Laxmi Swathi Residency, 204, Santha Palem, China Gadili,
Old dairy farm (Po), Visakhapatnam - 530 040.
A.P., INDIA. Call : 9346960601 / 9490266640
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

# యాత్రికుని ప్రయాణం


బిషప్.ఎం.ఎ.పాల్

మానవ జీవితం వికసించిన పువ్వువంటిదని, నీటి బుడగ వంటిదని, నీడలాంటిదని ఒక కథను పోలినదని, అది ఒక యాత్ర అని రకరకాలుగా చెప్పుకోవడం మనము వింటూ ఉంటాము; నిజమే. అయితే ఈ భూమిమీద పుట్టిన ప్రతి మానవుడు ఒక దినాన చేరవేసిన గమ్యాన్ని సృష్టికర్త నిర్ణయించాడు. అదే జీవముగల దేవుని నివాసస్థలమైన "సీయోను". అదే నిత్యరాజ్యం. కొందరు యాత్ర ప్రారంభించి వైఫల్యం చెందుతున్నారు. కారణము ఏమిటంటే దేవుడు తమకు సిద్ధపరచిన గమ్యమును గూర్చి తెలియకపోవుట, తెలిసినా దానిని గూర్చిన నిరీక్షణ లేకపోవుటయే.

పరిశుద్ధ గ్రంథములో ఒక వ్యక్తి 120వ కీర్తనలో యాత్ర ప్రారంభించి 134వ కీర్తనలో స్తుతి ఆరాధన యోధుడైన దావీదును జ్ఞాపకం చేసుకుంటున్నాడు. అతని యాత్ర ప్రారంభ దినాలలో తాను కేదారు గుడారములలో నివసించానని చెప్పుచున్నాడు.

**“అయ్యో, నేను మెషెకులో పరదేశినై యున్నాను. కేదారు గుడారముల యొద్ద కాపురమున్నాను. కలహప్రియునియొద్ద నేను చిరకాలము నివసించినవాడను. నేను కోరునది సమాధానమే. అయినను మాట నా నోట వచ్చినతోడనే వారు యుద్ధమునకు సిద్ధమగుదురు”** (కీర్తన 120:5,6,7).

కేదారు నివాసులు ఇష్మాయేలు సంతానము. వారు యుద్ధ కాంక్ష కలిగినవారు. సమాధానము కోరుకొనని జనాంగము. వారితో ఈ యాత్రికుని ప్రయాణం ప్రారంభంలో ఆనందముగా ఉన్నప్పటికీ చివరికి చేదు అనుభవాన్ని మిగిల్చింది. అతడు దుష్టసహవాసము వలన చాలా వేదన అనుభవించాడు. అతనికి కలిగిన నిందలు, అవమానాలు, అతనిలో దీనత్వము కలుగజేసాయి. కనుకనే యాత్రికుని దర్శనం మారినది. అతడు ఓ క్రొత్త సమూహామును చూచి వారితో సాంగత్యము చేసాడు. ఆ సమూహపు ప్రభావము వలన కొండలవైపు కన్నులెత్తాడు; క్షేమము నెమ్మది కొరకు పైనున్న వాటిని వెదకుట ప్రారంభించాడు. **దేవుని వలననే తనకు సహాయము దొరుకునని గుర్తించాడు.** కీర్తన 121:2

స్నేహితులారా! దేవునిని ఆరాధించు ఒక సమూహము యాత్రికుని జీవితాన్ని ప్రభావితం చేసినప్పుడు మానవాళి కొరకు పవిత్రమైన రక్తాన్ని చిందించిన యేసు క్రీస్తును రక్షకునిగా కలిగిన మనము ఎందరి జీవితాలను ప్రభావితం చేయగలమో ఆలోచించండి.

**“దేవుని మందిరమునకు జనులు వెళ్ళుదుమని చెప్పినపుడు అతడు బహుగా సంతోషించాడు”** (కీర్తన 122:1). అప్పటివరకు సృష్టికర్తకు బదులుగా సృష్టాన్ని పూజించిన యాత్రికుడు సృష్టికర్తను ఎరిగిన తరువాత తన జీవితపు గురిని, గమ్యాన్ని గుర్తించాడు.

**“యెహోవా సీయోనును ఏర్పరచుకొని యున్నాడు. తనకు నివాసస్థలముగా దానిని కోరుకొనియున్నాడు. ఇది నేను కోరిన స్థానము, ఇది నిత్యము నాకు విశ్రమ స్థానముగా నుండును. ఇక్కడనే నేను నివసించెదను. దాని ఆహారమును నేను నిండారులుగా దీవించెదను. దానిలోని బీదలను ఆహారముతో తృప్తిపరచెదను”** (కీర్తన 132:13,14,15).

ఈ దినాలలో అనేకులు చుక్కానిలేని నావవలె గమ్యము లేనివారై తరుగుతూ ఉంటారు. మరికొందరు పరలోక రాజ్యములో చేరు మార్గము తెలిసిన అది మా భక్తి మార్గము కాదు అంటారు. గమ్యము లేనివారైనా, దేవుడు సిద్ధపరచిన స్థలమునకు చేర్చు యాత్ర చేయనివారెవరైనా అగ్ని గుండములో ప్రవేశింపక తప్పదు. అది సాతాను అతని అనుచరులకు సిద్ధపరచిన స్థలము. అక్కడికి చేరిన తరువాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం ఉండదు. ధనవంతుడు లాజరు చరిత్ర మీకు తెలియనిది కాదు కదా! యాత్రికుడు విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము గాని, యాకోబు గాని, ఇస్సాకును గాని జ్ఞాపకము చేసుకొనక దావీదును జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఎందుకు?

**1. దావీదు యొక్క సమర్పణా జీవితం :**

**“యెహోవా, దావీదునకు కలిగిన బాధలన్నిటిని అతని పక్షమున జ్ఞాపకము చేసికొనుము. అతడు యెహోవాతో ప్రమాణపూర్వకముగా మాట యిచ్చి, యాకోబు యొక్క బలిష్ఠునికి మ్రొక్కుబడి చేసెను. ఎట్లనగా యెహోవాకు నేనొక స్థలము చూచువరకు యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాసస్థలము నేను చూచువరకు నా వాసస్థానమైన గుడారములో నేను ప్రవేశింపను, నేను పరుండు మంచము మీదికెక్కను. నా కన్నులకు నిద్రరానియ్యను. నా కన్ను రెప్పలకు కునికిపాటు రానియ్యననెను”** (కీర్తన 132:1-5).

పై వాక్యము దేవుని యెడల దావీదునకు గల ప్రేమను, అతని యథార్థ హృదయమును తెలియజేయుచున్నది. దేవునికి గుడారము నిర్మింపబడునంత వరకు తన సుఖాన్నంతటిని త్యాగం చేయుటకు సిద్ధపడిన వ్యక్తి దావీదు. **‘నన్ను ఘనపరచువానిని నేను ఘనపరుస్తాను’** అని సెలవిచ్చిన దేవుడు తనను ఎంతగానో ఆరాధించు హృదయముగల గొఱ్ఱెలకాపరియైన దావీదును ఇశ్రాయేలీయులకు మహారాజుగా చేసాడు. దావీదు దేవుని సాక్ష్యపు గుడారపు విషయమై ఎంత శ్రద్ధ కలిగియున్నాడో ఇశ్రాయేలీయుల చరిత్రను వివరించిన స్తెఫను మాటలలో గమనించగలము. **“సాక్ష్యపు గుడారము దావీదు దినముల వరకు ఉండెను. అతడు దేవుని దయను పొందెను”** (అపో.7:4,5). దేవుడు చూపిన మాదిరి చొప్పున మోషేచేత తయారుచేయబడిన సాక్ష్యపు గుడారము యెహోవా నివాసస్థలమని, ఆయన మహిమ ఎల్లప్పుడు ఆ గుడారముపై ఉన్నదని గుర్తించిన దావీదు, దాని విషయమై మిక్కిలి శ్రద్ధను కనుబరిచాడు. కనుకనే అతడు దేవుని దయను పొందాడు.

ఈ రోజుల్లో అనేకులు సేవ చేయుచున్నాము అంటున్నారు కానీ, సేవ ఎలా చేస్తున్నారు అనునది ప్రాముఖ్యం. దేవుని చిత్తానుసారమైన సేవ మిమ్మును మాత్రమే గాక మీ ద్వారా అనేకులలో శుభప్రదమైన నిరీక్షణ కలుగజేసి, దేవుని దయను పొందుటకు యోగ్యులుగా చేసి, నిత్యరాజ్యమునకు చేర్చగలదు. దైవజనుడైన మోషే దేవునియొద్దనుండి ధర్మశాస్త్రమును పొందినవాడు; దేవునితో ముఖాముఖిగా మాట్లాడినవాడు. అంతటి దైవజనుడు ఒకరోజున ప్రజలయెదుట దేవుని నామమును పరిశుద్ధపరచలేకపోయాడు. అంతే! లక్షలకొలది ఇశ్రాయేలీయులను వాగ్దానదేశమునకు నడిపించుటకు నాయకునిగా ఎన్నుకొనబడిన మోషే ఆ దేశములో ప్రవేశించకుండానే తనయాత్రను ముగించవలసి వచ్చినది. దేవునిని ఘనపరచని సేవ ముగింపు ఈలాగే ఉంటుంది.

ప్రియులారా! సేవాజీవితంలో దేవునిని ఘనపరచే హృదయం, ఆయన కొరకు సమస్తమును నష్టముగా, పెంటతో సమముగా ఎంచుకొనే మనస్సు కలిగియుండాలి. అప్పుడే ఆయన చిత్తానుసారమైన సేవ చేయగలము. లోకాన్ని, సేవను మిళితం చేస్తే చివరకు గమ్యాన్ని చేరలేం. కొందరు రక్షింపబడినప్పుడే గమ్యాన్ని చేరినట్లుగా భావిస్తారు. అది పొరపాటు. రక్షణ అనునది ఒక వ్యక్తి మార్పు చెందాడు అనుటకు ఒక ప్రాథమిక అనుభవం మాత్రమే. ఆ తరువాత అతడు సజీవయాగముగా తనను దేవునికి సమర్పించుకొనుట ద్వారా పరిశుద్ధపరచబడి, పరిశుద్ధాత్మ అనుభవములో అంతము వరకు కొనసాగినప్పుడు మహిమలో చేర్చబడతాడు. ఇది కడవరి రక్షణ. ఇది ప్రతీ విశ్వాసి గమ్యమైయుండాలి.

దావీదు యెహోవాకు నివాసస్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని దేవునితో నిబంధన చేసాడు. అయితే దేవుడు దావీదు హృదయాన్ని, సమర్పణను, త్యాగమును తనపట్ల ప్రేమను యెరిగినవాడై ప్రవక్తను పంపి **“నీ కుమారుని ద్వారా నాకు ఒక మందిరము కట్టబడుతుంది. నీ కుమారునికి నేను తండ్రిగా ఉంటాను”** అని వాగ్దానం చేసాడు **(2 సమూయేలు 7:14).** ఇది దావీదు జీవితంలో ఒక గొప్ప అనుభవం. తండ్రి దేవుని కొరకు తన సుఖాన్ని త్యాగం చేయుటకు సిద్ధపడినప్పుడు దేవుడు అతని కుమారునిగా తండ్రిగా నేనుంటానని వాగ్దానం చేస్తున్నాడు. ప్రియులారా! ఈ అనుభవములో ప్రతి విశ్వాసి, సేవకుడు నడిపించబడాలని నా ఆకాంక్ష.

2. దావీదు తండ్రి స్వభావమును ప్రత్యక్షపరచాడు :

దావీదు కుమారుడైన అబ్షాలోము రాజ్యకాంక్ష కలిగి తండ్రికి విరోధముగా ప్రవర్తించినందున దావీదు సింహాసనం విడిచి పారిపోయాడు. ఆ సమయములో ప్రతి ఒక్కరూ దావీదును కుమారునితో యుద్ధమునకు ప్రేరేపించిన వారే. కానీ అతడు తన కుమారుని హతము చేయుము అని సైనికులకు సెలవియ్యకపోగా, నన్నుబట్టి అబ్షాలోము యెడల దయచూపుము అని బ్రతిమిలాడుట గమనించండి. తన వేదనకు, కన్నీటికి, అవమానానికి కారకుడు కుమారుడే అయినప్పటికి దావీదు తన కుమారుని నాశనాన్ని కోరుకోలేదు. నిజమైన తండ్రి తన పిల్లల నాశనాన్ని కరుకోడు. మరియు వారిమీద ఆధారపడడు; వారి కొరకు తానే సంపాదించి పెడతాడు. వారి కొరకు తనకున్న ద్రవ్యమును వ్యయపరచుటకు సిద్ధపడతాడు; **ఇది తండ్రి స్వభావము.** ఈలాంటి మనస్సు కలిగినవారు నేటి క్రైస్తవ సంఘానికి చాలా అవసరం.

అపోస్తలుడైన పౌలు కొరింథి సంఘానికి ఇలా వ్రాయుచున్నాడు. **“నాకు కలిగినది యావత్తు మీ ఆత్మల కొరకు బహుసంతోషముగా వ్యయపరచెదనని; నన్ను నేను వ్యయపరచుకొందును”** అని అంటున్నాడు **(2 కొరింథీ 12:15)**. సేవకులు సంఘానికి కాపరులు. వారు తండ్రి మనస్సు కలిగినవారుగా ఉన్నప్పుడు ఆ సంఘములోని పిల్లలు పోషింపబడి, సిద్ధపరచిన గమ్యాన్ని చేరుకోగలరు.

**3. శ్రమల ద్వారా విధేయత నేర్చుకున్నాడు :**

గొఱ్ఱెల కాపరి అయిన దావీదు ఫిలిష్తీయుడైన గొల్యాతును సంహరించాడు. ఆ తదుపరి రాజైన సౌలు తనకు, తన సైన్యానికి చేసిన మేలుకు ప్రతిగా దావీదుకు కీడు చేయనుద్దేశించాడు. నిర్నిమిత్తముగా దావీదును తరిమాడు అతనికి కొండలలో అరణ్యములలో తిరుగవలసిన పరిస్థితి ఏర్పడినది. ఓ చోట శత్రువుల బారినుండి తప్పించుకోవడానికి వెఱ్ఱివానివలె ప్రవర్తించాడు. అతడు శ్రమల కొలిమిలో కాల్చబడ్డాడు. ఒక రోజున తనకున్న సమస్తాన్ని పోగొట్టుకొని, శక్తిలేనంతగా ఏడ్చాడు. అయితే దావీదు జీవితంలో ఒక గొప్ప విశేషమేమంటే – అతడు అన్ని సందర్భాలలో తన గురిని యెహోవా మీద నిలిపాడు; ఆయన యొద్దనే విచారణ చేసాడు. ఆయనయందు భయభక్తులు గలవారికి ఏ మేలు కొదువలేదు అని విశ్వాసముతో చెప్పగలిగాడు. శోధింపబడిన దావీదు సువర్ణముగా మార్చబడ్డాడు. తన శ్రమానుభవములో దేవుడు తనకు తోడుగా వున్నాడని గుర్తించాడు. నా దేవునికి నివాస స్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని ప్రమాణము చేసాడు.

ప్రియులారా! శ్రమలు – దీనత్వమును, విధేయతను నేర్పుతాయి. **ప్రభువైన యేసుక్రీస్తు శ్రమల ద్వారా విధేయతను నేర్చుకున్నాడు** (హెబ్రీ 5:8). మనము శ్రమలనుభవించి దేవుని రాజ్యములో చేరవలసియున్నది అని దేవుని వాక్యం చెప్పుచున్నది. యేసుక్రీస్తును రక్షకునిగా కలిగిన మన జీవితాల ద్వారా అనేకులకు క్రీస్తు ప్రేమను ప్రత్యక్షపరచాలి. నిరీక్షణ లేని ప్రతి ఒక్కరిలో నిరీక్షణ కలుగజేయాలి. దావీదు వెళ్ళిన అనుభవాలే యాత్రికుడు దావీదును జ్ఞాపకం చేసుకోవడానికి ప్రధాన కారణం. ఈ అనుభవాలు మనము గురిని చేరుటకు ఉపయోగపడు సాధనాలు.

పాఠకులారా! దావీదు నిర్మించాలని తీర్మానించుకున్నది దేవుని మందిరం; అది భూసంబంధమైనది. క్రొత్త నిబంధన కాలములో నివసించుచున్న మనము దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నామని అపోస్తలుడైన పౌలు సెలవిచ్చుచున్నాడు (ఎఫెసీ 2:19-22). **“తన యెడల యథార్థ హృదయము కలవారి కొరకు యెహోవా కనుదృష్టి లోకమంతట సంచారము చేయుచున్నది”** కనుక మనము యాత్రికుని వలె యథార్థ హృదయము కలవారమై, దావీదు వలె దేవుని దయను పొంది, ఆయనకిష్టానుసారమైన వారిగా జీవించాలని నా ప్రార్థన.

**దావీదు యెహోవాకు నివాసస్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని దేవునితో నిబంధన చేసాడు. అయితే దేవుడు దావీదు హృదయాన్ని, సమర్పణను, త్యాగమును తనపట్ల ప్రేమను యెరిగినవాడై ప్రవక్తను పంపి “నీ కుమారుని ద్వారా నాకు ఒక మందిరము కట్టబడుతుంది. నీ కుమారునికి నేను తండ్రిగా ఉంటాను” అని వాగ్దానం చేసాడు.**

## టి వి బోధకుల్లారా..!

విశ్వాసుల్ని కనీసం ప్రార్థనైనా చేసుకోనివ్వరా?! మీకు చెబితే అదీ మీరే చేసేస్తారా? వారి గొంతును చనిపోయేవరకు దేవునికి వినబడనివ్వరా? యేసు తన శిష్యులకు ప్రార్థన నేర్పారన్నది మరిచారా? మిమ్మల్నే గ్రుడ్డిగా నమ్మే విశ్వాసులకు ప్రార్థన చేసుకోమని ఇంకెప్పుడు చెబుతారు? అలా చెబితే మీ ఆదాయం పోతుందన్న వ్యాపారాత్మక ధోరణి మీచే అలా చెప్పనివ్వట్లేదా? (మరింత విశ్లేషణ వచ్చే పేపర్లలో) – బ్రదర్ వైకెయార్

## విశాఖ క్రైస్తవ సంఘానికో ప్రత్యేక విజ్ఞప్తి

మన దేశ క్షేమాభివృద్ధి కొరకు ప్రతి ఆదివారం ఆరాధనల్లో రెండు ప్రత్యేకమైన ప్రార్థనా విన్నపములు గుర్తుచేసుకోగలరు

1) మన దేశమంతా దేవుని గూర్చిన జ్ఞానములోనికి రావాలని
2) ప్రభువు ఇచ్చిన ఆజ్ఞ - మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించబడాలని
3) భారతదేశ ఐకమత్యం కొరకు ప్రార్థన చేయండి – బిషప్ ఎం.ఎ.పాల్

చాకిరేవు

-ఎడిటర్

# డబ్బుందా.. అయితే మీరే బోధకులు !

❑ అందుకు ఫెలోషిప్పులు, చర్చిలనే కట్టడాలున్నాయి!
❑ పాస్టర్స్ ఫెలోషిప్పులు వందరూపాలు, భోజనాల కోసమేనా?!

రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెల ఏదో ఓ రోజున వారి నిర్ణయాలను, అను కూలతలను బట్టి 'సేవకుల సదస్సు' లేక 'పాస్టర్స్ ఫెలోషిప్'ల పేరట కాపర్లు కూడుకొంటుంటారు. ఈ ఫెలోషిప్పుల్లో ప్రసంగాలకు చాలా ప్రాంతాల్లో డబ్బున్న వారినే బోధించేందుకు పిలిపించుకుంటుంటారు. వారు డబ్బులివ్వాలి. ఆ డబ్బులతో ఆ సమయాన భోజనాలు ఏర్పాటు చేస్తారు. ట్రావెలింగ్ పేరున కనీసం వందరూపాయలు ఒక్కో కాపరికి ముట్టజెప్పాలి. లేకుంటే పిలవరు. వాక్యావగాహన, వాక్యంలో పట్టు లేకున్నా అలా డబ్బులివ్వగలిగే వారినే బోధించేందుకు పిలుస్తారు. ఇది దేవునిలో ధౌర్భాగ్యస్థితి. వాక్యంలో పట్టున్నా డబ్బులివ్వగలిగే స్థోమత లేకుంటే పిలువకపోవటం కడుశోచనీయం. ఇదే జాఢ్యం అనేక చర్చిలకు అంటుకుంది. చర్చిల్లో బోధలూ డబ్బులిచ్చే వారికే దక్కుతున్నాయి.

డబ్బులిచ్చే వారినే బోధలకు పిలుచుకొనే ఫెలోషిప్పుల్లో ఎప్పుడూ ఆధిక్యతా పోరాటాలే. ఒకరంటే ఒకరికి అసలే పడదు, పొసగదు. నిందారోపణలకు అంతే ఉండదు. డబ్బున్న వారితో ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ పబ్బం గడిపేస్తుంటారు. తద్వారా వారికేమో ఛీ ఈ కాపర్లందరూ ఇలా తయారయ్యారేంటి? అన్న జుగుప్స కలిగిస్తుంటారు. విదేశీ దొరల దగ్గర దండుకొంటూ సేవ వెలగబెడ్తున్న మిషనరీలకేమో వీరి అవసరం ఉంటుంది. అదీ దొరలొచ్చేటప్పుడు మాత్రమే. ఫెలోషిప్పులంటే ఇష్టం లేకున్నా తమ దగ్గరకు దొరలొచ్చారు కాబట్టి వీరిని ఆయా సమయాల్లో ఆ మిషనరీలు వాడుకుంటుంటారు. ఈ కాపర్లపై అప్పుడు మాత్రమే కావల్సినంత ప్రేమ ఒలకబోస్తారు.. ఆకట్టుకొని దొరలకు వీరిని చూపుతారు. నా వెనుక ఇంతమంది ఉన్నారని డబ్బా కొట్టుకుంటారా మిషనరీలు. ఆ సంగతి ఫెలోషిప్పు వారికి తెల్సినా వెళ్లకమానరు. ఎందుకంటే భోజనాలు, ట్రావెలింగ్ ఖర్చులు వస్తాయి కాబట్టి.

అలాంటి ఫెలోషిప్పుల్లో బోధించేందుకు ఎందుకు వెళ్తున్నారని ఏ మిషనరీని ప్రశ్నించినా, ఫెలోషిప్పుల్లో అత్యధిక శాతం పై కోవకు చెందిన వాటిగానే ఉన్నాయని, అందుకెంతో బాధపడుతున్నామని మరలా ఆ మిషనరీలే చెబుతుంటారు. మరెందుకండీ ఇవి అని ప్రశ్నిస్తే ఏం చేస్తాం, ఒకరికొకరం సహకరించుకోవాలి గదా అంటూ ప్రేమ ఒలకబోస్తారు. ఈ విషయమై ఫెలోషిప్పు వారిని అడిగితే ఏదో ఓ రోజున వారు మరింత సహాయం చేస్తారేమోనన్న ఆశే మా చేత అలా చేయిస్తుందంటారు. కాపర్లు ఇలా ఉన్నంత కాలం వారి బ్రతుకుల్లో మార్పు ఏ కోశానా రాదన్నది వాక్య ప్రేమికుల మాట. కాపర్లు వాక్యాసక్తిపరులై, వాక్యాన్ని బలంగా నేర్పే వారినే ఫెలోషిప్పుల్లో బోధించుటకు తీసుకొచ్చే రోజులు రావాలంటున్నారు. అప్పుడే వారి బ్రతుకుల్లో మార్పు ఉంటుందంటున్నారు. వందరూపాయలకు, భోజనాలకు వెంపర్లాడే ఫెలోషిప్పులు శాపగ్రస్తమై పోతాయంటున్నారు! ఇవన్నీ మిషనరీలపై ఫెలోషిప్పు నాయకులు, ఫెలోషిప్పు నాయకులపై మిషనరీలు ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నవే. కాపర్లు మిషనరీలు ఇతరులతో పంచుకుంటూ అనేక చోట్ల చర్చలకు దారితీస్తున్నవే.

ప్రియకాపరీ, నీవున్న ఫెలోషిప్పు ఎలా ఉందో చూచుకో. అలాగే మీ దగ్గరకు వస్తున్న మిషనరీల సాక్ష్యం ఈ లోకంలో ఎలా ఉందో చూచుకొనుట మీకు, మీచే నడుపబడుతున్న విశ్వాసులకు మేలు కలిగిస్తుంది. బహు జాగ్రత్త సుమా!

# పరిచర్య, పబ్లిసిటి రెండూ ఒక్కటేనా?!

పరిచర్యకు, పబ్లిసిటీకి ఉన్న బేధమేంటో మనలో చాలామందికి తెలియట్లేదు. కొందరికి తెల్సినా, డబ్బుఖర్చు చేసే మనస్సు లేక పరిచర్యకు పబ్లిసిటీ అన్న ముసుగువేస్తున్నారు. మీరు చేస్తున్న దేవుని పరిచర్య ప్రకటింపబడకపోతే దేవుడు మీకు తగిన గుర్తింపు ఇవ్వరు. మనలో అనేకమంది అనేక రకాలుగా డబ్బు సంపాదిస్తూ 'కోటీశ్వరులు'గా చలామణీ అవుతున్నారు. కాని అందుకు తగ్గ మహిమ ఈ లోకంలో వారికి లేదనుట నిర్వివాదం. మన ద్వారా దేవుడు చేయిస్తున్న సేవ ప్రకటింపబడకపోతే మన తర్వాత మన కుటుంబీకులు సేవను ఎలా చేస్తారు. మనం చేసే దేవునిసేవ అనేకులను పురిగొల్పాలి. మాదిరికరంగా ఉండాలి. లేకుంటే క్రైస్తవులని మీరని పించుకుంటున్నా మీరు క్రైస్తవులే కారన్నది బైబిలు పండితుల మాట. యేసు చేసిన కార్యాలను బట్టి తండ్రియైన దేవుడే నాడు అందరిలో ఆయన్ను మహిమ పరచారన్నది మరువకండి. కాట్టి ఇకపైనైనా మీ దగ్గరున్న డబ్బుకు తగిన గుర్తింపు ఈ లోకంలో ఉందో లేదో మీకై మీరే పరీక్షించుకోండి. మీ డబ్బు మీయొద్దే ఉంటుందేమోగాని రానున్న దినాల్లో మీరుండరన్నది గుర్తించండి. మనమున్నా లేకున్నా మన ద్వారా జరిగే దేవుని సేవ అనేకుల్ని పురిగొల్పాలి. ఎందరికో మాదిరి కావాలి. అందుకు 'ధనాన్ని' సద్వినియోగం చేయాలి. అపోస్తలులు అదే చేశారు. అందుకే వారు ఎప్పటికీ అందరిచే కొనియాడబడతారు. ధనాన్ని ప్రేమించక దేవున్నే వారు ప్రేమించారు. 'తమకొచ్చిన ధనాన్ని అందరికీ వారివారి అక్కరచొప్పున పంచేసత్తా వారికుందని నిరూపించారు'. తద్వారా ధనం దేవునికోసమేనన్నది వారు చేతల్లో చూపారు. కాబట్టి మిమ్మల్ని ఆలోచించమంటున్నా! మీ చదువులకు, మీ దగ్గరున్న ధనానికి తగిన విలువ మీకుందా? లేదంటే అందుక్కారణం వాటిని మీకిచ్చిన దేవుని కోసం వాటిని ఉపయోగించకపోవుటయేనన్నది నిర్వివాదం. ఉపయోగిస్తేనే సరిపోదు. ఆ సేవ ప్రకటించబడాలి.. అనేకులకు మాదిరి కావాలి.

మా సేవ రహస్యం మండీ! దేవునికి తెలిస్తేచాలన్న కబుర్లు చెప్పకండి. దేవునికి తెలియకుండా మీరు 'ఏ గ్రహంలో' సేవ చేయగలరు?! దేవునికి తెలిస్తే చాలన్నవారు డబ్బుని ప్రేమించి, ఖర్చు చేయుటకు మనసొప్పని వారేనన్నది వారి మాటలు, ప్రవర్తనల బట్టియే తేటతెల్లమౌతుంది. మరికొందరు సేవకు సహకరిస్తారు. దాన్ని ఇతరులకు తెలియజేయ వద్దంటారు. రహస్యంగా ఉండాలనుకుంటారు. ఇది చాలా తప్పు. సేవన్నది బహిరంగం. సేవకు సహకరించుటా బహిరంగమే. 'రహస్యంగా ఇచ్చేది ధర్మం'. బహిరంగంగా ఇచ్చేది కానుక. ఈ అవగాహన లేనివారే తాము దేవుని కోసం చేసింది రహస్యంగా ఉంచాలనుకుంటారు. దేవునికి ధర్మం చేసేటంతటి గొప్పవారు ఈ లోకంలో ఎవరైనా ఉంటారా? ఉండరు! తాము దేవుని కోసం చేసిన దాన్ని రహస్యంగా ఉంచమని కోరేవారు దేవునికే ధర్మం చేసే వారిగా వాక్యం వారిని పరిగణిస్తుంది. కాబట్టి అట్టివారు జాగ్రత్త పడాలి. తాము చేసిన దాన్ని సాధ్యమైనంతలో అనేకులకు తెలపాలి. అది దేవునికి ఇష్టమైనదని ఎరగాలి. అనేకులకు తెలియచెప్పుట పరిచర్యలో ఓ భాగం! ఇకపై చేద్దామనుకుంటున్నది, అప్పటికే చేసిందాన్ని పదేపదే చెప్పుట/ ప్రచురించుట పబ్లిసిటీ.

-బ్రదర్ వైకెయార్

క్రైస్తవులకు, సీనియర్ సిటిజన్స్‌కు రుణములపై ప్రత్యేక రాయితీ!

అమృత వర్షిణి మ్యాక్స్ లిమిటెడ్

సేవింగ్స్ & క్రెడిట్ సొసైటీ

మరిన్ని వివరములకు సంప్రదించండి.
ఫోన్ : 0891-6002999



డైరెక్టర్
సిహెచ్. ప్రభాకర్

అమృతవర్షిణి

మ్యూచువల్లి ఎయిడెడ్ కో - ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

రిజిష్టర్డ్ నెం. AMC/VSP/DCO 2012/3008 ఫోన్ : 0891-6002999

- మెంబర్లుగా చేర్చుకోబడును.
- డిపాజిట్లు స్వీకరించబడును.
- డిపాజిట్లపై నెలసరి ఆదాయం/
- పెన్షన్ పొందవచ్చును.
- డిపాజిట్లపై, భూములపై, బంగారు ఆభరణములపై రుణాలు ఇవ్వబడును.

| కాలం | వడ్డీ (%) |
|---|---|
| 12 నెలలు | 12 % |
| 24 నెలలు | 13 % |
| 36 నెలలు | 13.5 % |
| 48 నెలలు | 14 % |
| 60 నెలలు | 15 % |

సంప్రదించండి : ఆఫీస్ : ఫ్లాట్ నెం. 401, బొచ్చా స్క్వేర్. 5వ, అంతస్తు, బిర్లా జంక్షన్, మురళీనగర్, విశాఖపట్నం. ఫోన్ : 0891-6002999



బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను పటాపంచలుగావించే.....దుర్బోధకులకు చెక్ పెట్టే....?! అనేక మర్మగర్భ వాక్య సారాంశాలు సులువుగా నేర్పే...

## 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా'

# యేసును నమ్మండి - లోకాచారాలను కాదు

### గర్విష్టులనైనను త్రోవ విడిచి అబద్ధములతట్టు తిరుగువారినైనను లక్ష్యపెట్టక యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు. ★

లోకంలో మనం అనేకమంది గర్విష్టులను చూస్తుంటాం. అలాగే నిజదేవున్నెరిగిన తర్వాత కూడా కొందరు గర్విష్టులుగా మనకు అక్కడక్కడ కన్పడొచ్చు. దానిక్కారణం వారు దేవుని ప్రేమను ఎరుగకపోవుటయేనని గ్రహించుకోవాలి. ఎందుకంటే వారు దేన్ని బట్టి గర్విస్తుంటారో దాన్ని వారికి దేవుడే తన కృపచొప్పున ఇచ్చారన్నది మరచినవారు. ఆయా ఆధిక్యతలనుబట్టి గర్విస్తారేగాని వాటిని తమకు దేవుడెందుకు ఇచ్చారో గమనించుకోరు. నాశనానికి ముందు గర్వం నడుస్తుందన్న దేవుని వాక్యం అట్టి వారి యెడల తప్పక నెరవేర్తుంది. తద్వారా తర్వాతి దినాల్లో వారు అన్ని విధాలా లోకంలో నశించుట చూడగలం. లేఖనాలు బయల్పరచు సంగతులను బట్టి తమ జీవితాలను మలచుకొనువారందరు ధన్యులే!

పై వాక్యంలో చెప్పబడిన విధంగా గర్విష్టులు క్రైస్తవుల్లోవున్నా, ఇతరుల్లోనున్నా మనం వారిని లక్ష్యపెట్టక దేవునిలో మనం జీవించగలగాలి. వారి యొద్ద ఏదోఒకటి పొందొచ్చని భావిస్తూ వారి కనుసన్నలలో బ్రతుకుతూ వారినే లక్ష్యపెట్టువారు తమ జీవితాల్లో అన్నీ పోగొట్టుకొనుట ఖాయం. మనకేమి ఉన్నా, లేకున్నా దేవుడున్నాడని తెల్సుకున్నవారే ధన్యులు. అట్టివారు మాత్రమే గర్విష్టులను లెక్కచేయరు. అలాగే క్రైస్తవుల్లో అనేకులు మార్గము విడిచి 'అబద్ధములను' ఆశ్రయిస్తుంటారు. అట్టివారిని లక్ష్యపెట్టక్కర్లే! అబద్ధములు అనగా లోకాచారములు, వాటి మహిమలు, ఇంకా స్పష్టంగా చెప్పుకోవాలంటే దేవుడు లేక దేవుని జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములు (తిమోతి 6:20) తద్వారా జరిగే దైవ వ్యతిరేక కార్యములు మొదలగునవి. వాటిని చేస్తూ వాటి వలన ఆశీర్వదింపబడతామని గుడ్డిగా నమ్మేవారు ఈ మధ్య క్రైస్తవుల్లో ఎక్కువగుట కడుశోచనీయం.

క్రైస్తవుల్లో అనేకులు వాస్తులు, రత్నఉంగరాలు, పొడులతో కూడిన ఉంగరాలు, జాతకాలు, సమయాలు పాటిస్తున్నారు. తమ వాహనాలకు, ఇతరములైన వాటికి లక్కీనెంబర్లంటూ వేసుకొనుట కూడా చూస్తుంటాం. ఇవన్నీ దేవునిలో భ్రష్టత్వానికి చిహ్నాలు. అట్టి వాటిని అనుసరించేవారు క్రీస్తుని అనుసరించామని ఇతరులకు ఏలాగు చెప్పగలరన్నదే మిలియన్ డాలర్ ప్రశ్న. అట్టి వారు దేవునిలో భ్రష్టులే. ఇది ఎందరో భక్తిపరులైన క్రైస్తవుల హృదయవేదన! వాక్యానుసారంగా దేవున్నెరిగిన వారు లోకాశలలో పడరు. లోకం వారి పాదాలచెంతకు వస్తుంది. ఎందుకంటే వారు తామెరిగిన దేవుని గూర్చి ఎరుగని ఇతరులకు ప్రకటిస్తుంటారు కాబట్టి.అట్టి వారిని గురించి సువార్త చేయుపాదములెంతో సుందరములైనవని దేవుడే తన గ్రంథంలో వ్రాయించారు. సువార్త చేస్తూ జీవించువారు గర్విష్టులను, త్రోవ విడిచి అబద్ధముల తట్టు తిరుగువారిని ఖాతరు చెయ్యరు. వారెంతసేపూ లక్ష్యపెట్టేది.... దేవుడప్పగించిన పని (సువార్త) అన్న 'గురి'నే! ఆ గురివైపుకే తమ బ్రతుకుకాలమంతా పరుగెడుతుంటారు.. నడువరుసుమా! నడిచేవారు గురినెప్పుడు చేరుతారో చెప్పలేం. గురి యొద్దకు పరుగెట్టినవారే దేవునికిష్టులు, వారే వాక్యాన్ని తమ బ్రతుకుల్లో అన్వర్తించుకున్నవారు. అందుకే వారు గర్విష్టులను, త్రోవ విడిచి అబద్ధముల తట్టు తిరుగువారినైనను లక్ష్యపెట్టరు. అందుకు కారణం తాము వాక్యానుసార జీవితాన్ని కలిగియుండుటయే. మనందరం అట్టివారిగానే ఉండాలి.

వాస్తులు పాటించుట, నవరత్న ఉంగరాలు ధరించుట, జ్యోతిష్యాలు, ముహూర్తాలు, పనికిమాలిన దర్శనాలు, వస్తువులకు, వాహనాలకు 7, 9 మొదలగు అంకెలను వాడుతూ వాటిని అదృష్టం తెచ్చేవాటిగా భ్రమించరాదు. వాటిని పాటించే క్రైస్తవులు క్రీస్తును ఇతరులకు ప్రకటించుట అసాధ్యం. ఎందుకనగా ఇతరులలో అనేకులు ఆయా నమ్మకాలు కలిగున్నారు. ఆ సంగతి మనం వింటున్నాం, చూస్తున్నాం. ఆచారాలు పాటించే క్రైస్తవులు క్రీస్తును గూర్చి వారికి చెబితే వారెలా నమ్ముతారు? మీరు ఆయా ఆచారాలు పాటించుట వల్లే ఈ లోకంలో ధనవంతులుగా చలామణి అవుతున్నారే గాని క్రీస్తు వలన కాదు అని వారు వాదిస్తే అట్టి క్రైస్తవులేమిచెబుతారు? కాబట్టి ఇకపైనైనా క్రీస్తును ప్రకటించువారుగా మాత్రమే అందరూ ఉండాలని ఆశిస్తున్నాం. లేఖనాలకు భిన్నంగా ప్రవర్తిస్తూ దైవోగ్రత తెచ్చుకోకూడదని ఆయా ఆచారాలను పాటిస్తూ క్రైస్తవులు అనిపించుకుంటున్న వారికి తెలియజేస్తున్నా!

మనలో కూడా అట్టి ఆచారాలను పాటించువారు ఉంటారా అన్న అనుమానం పాఠకులలో కొందరికి ఉండొచ్చు. అట్టి వారు ఉన్నారని తెలియజేయుటకు ఆచారాలు పాటించువారి ఫోటోలతో సహా ప్రచురిస్తూ వివరిస్తాం. రాబోవు క్రైస్తవనాడు పేపర్లను మిస్కాకండి!

# ...సాతాను విత్తిన గురుగులు!

**1) త్రిత్వము 2) త్రియేక దేవుడు 3) ఏడేండ్ల శ్రమలు 4) యేసురక్తమే జయము; ఎ) సిలువ రక్తమే జయము బి) ప్రభువైన యేసు నామమునకు సంపూర్ణ విజయం కలుగును గాక. 5) మధ్యాకాశం 6) రెండవ రాకడ 7) జన్మపాపము**

పైన మీరు చదివిన మాటలన్ని బైబిల్లో లేనివి. ఉన్నట్లే అన్పిస్తాయి. అందుక్కారణం.. వాటిని దేవునికి ఆపాధిస్తూ మునుపటి తరం బోధకులలా బోధించేసారుమరి! దేవుని గురించి బైబిల్లో వ్రాయబడని ఏమాటా మనం పలుకరాదు. సంపూర్ణ వివరాలు తదుపరి 'క్రైస్తవనాడు'ల్లో చదువగలరు. ఈలోపున మీ స్పందన రాసి విశాఖ కార్యాలయానికి పంపగలరు. **(అడ్రస్సు 1 మరియు 3వ పేజీల్లోగలదు.)** **- వాక్యాసక్తిపరుల కోరికపై బ్రదర్ వైకెయార్**

# తెలుసుకుందాం!

**★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును**



✽ నోబెల్ బహుమతి కింద తనకొచ్చిన సొమ్ములో చాలా భాగాన్ని తెలిసీతెలీని పద్ధతుల్లో ఇన్వెస్ట్ చేసి పోగొట్టుకున్నాడు ఐన్స్టీన్.



✽ పేలుడు పదార్థాలను గుర్తించేలా తేనెటీగలకు శిక్షణనివ్వొచ్చు.



✽ ప్రపంచ భూభాగంలో పదో వంతును హిమాలయాలు ఆక్రమిస్తున్నాయి.

✽ మలేషియాలో ప్రదర్శనకు ఉంచిన ఒక పెన్సిల్ పొడవు 65 అడుగులు.

✽ అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో 11,842 సరస్సులున్నాయి. ఈ రాష్ట్రాన్ని 'ల్యాండ్ ఆఫ్ 10000 లేక్స్'గా వ్యవహరిస్తారు.

✽ మానవ శరీరం వెయ్యికి పైగా జాతుల బ్యాక్టీరియాకు ఆవాసం.



✽ ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఏడాదికి సగటున 62,05,000 సార్లు కళ్లార్పుతాడు.

✽ పదిహేడో శతాబ్దానికి ముందు గోల్ఫ్ ఆడేందుకు చెక్కబంతుల్ని ఉపయోగించేవారు.



✽ 19వ శాతాబ్దంలో కనిపెట్టడానికి ఎక్కువ మందిచే కృషిచేయబడిన వస్తువు వాషింగ్మెషీన్. ఆ శతాబ్దంలో 1804 నుంచి 1873 మధ్య కాలంలో అమెరికా ప్రభుత్వం వాషింగ్మెషీన్ తయారీ పరిజ్ఞానానికి సంబంధించి 1676 పేటెంట్లు జారీచేసింది.

✽ బ్యాగ్పైప్ సంగీత వాద్యంలో బ్యాగ్ని ఎక్కువగా గొర్రె చర్మంతోనే తయారుచేస్తారు.

✽ ఆకాశంలో బాగా ఎత్తున ఎగిరే పెరిగ్రిన్ ఫాల్కన్ పక్షి నేలమీదున్న తన వేటను తన్నుకుపోయేటందుకు గంటకు 250 మైళ్ల వేగంతో కిందకు దూసుకెళ్తుంది.

✽ అంతరిక్షం నుంచి చూస్తే అత్యంత ప్రకాశవంతంగా కనిపించే నగరం లాస్వెగాస్.

✽ పెట్రోలు సాంద్రత పగటికన్నా రాత్రివేళల్లో అధికంగా ఉంటుంది.



# దురభిమాన పాపము

- డా.జాయ్ చెరియన్
'యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్',
రాం నగర్,
(హైద్రాబాద్)



**'దురభిమాన పాపములలో పడకుండ నీ సేవకుని ఆపుము, వాటిని నన్ను ఏలనియ్యకుము. అప్పుడు నేను యథార్థవంతుడనై అధిక ద్రోహము చేయకుండ నిందారహితుడనగుదును. యెహోవా, నా ఆశ్రయదుర్గమా, నా విమోచకుడా, నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక."** – కీర్తన 19:13,14

ఇది భక్తుడైన దావీదు చేసిన అద్భుతమైన ప్రార్థన. దురభిమాన పాపమంటే తెలిసి బుద్ధిపూర్వకముగా చేసే పాపము. కొన్ని పనులు చేయకూడదు, విశ్వాసికి తగదని తెలిసినా దైవభయము లేకుండా పాపము చేయడమే దురభిమాన పాపము. దాని ద్వారా దేవుని ఉగ్రత నీ మీదికి నీ కుటుంబము మీదికి వస్తుందని తెలిసినా పాపము చేయడానికి తెగిస్తున్నావు. నాకు అన్నీ తెలుసు అనే గర్వము నీలో ప్రవేశించినప్పుడే ఇలాంటి పాపము చేస్తావు. పాపమని తెలిసినా ఆ పాపమును జయించలేక దానికి బానిసవైపోతావు. పాపము నిన్ను ఏలినప్పుడు, పాపము చేత జయింపబడుతున్నావు. అపవాది నీ మీద ఏలుబడి చేస్తున్నాడు.

దావీదు పాపము చేశాడు. అందుకే ఈ కీర్తనలో దురభిమాన పాపములో పడకుండ నీ సేవకుని ఆపు, వాటిని నన్ను ఏలనియ్యకుమని ప్రార్థిస్తున్నాడు. 2వ సమూయేలు 11వ అధ్యాయములో చూస్తే – రాజైన దావీదు సాయంకాల సమయములో రాజనగరు మిద్దె మీద నడుస్తున్నప్పుడు స్నానము చేస్తున్న ఒక అందమైన స్త్రీని చూసి మోహించి, ఆమెను గూర్చిన సమాచారమంతా దూతల ద్వారా తెలిసికుంటాడు. ఆమె వివాహిత అని ఆమె భర్త ఊరియా సైన్యములో ఉండేవాడని తెలిసికొని ఆమెను పిలిపించి ఆమెతో శయనిస్తాడు. తనది కాని వ్యక్తిని, పొరుగువాని భార్యను ఆశించి ఆమెతో పాపము చేస్తాడు. పాపము ఎప్పుడూ ఒంటరిగా రాదు. ఒక పాపము కప్పుకోవడానికి మరియొక పాపము చేయవలసి వస్తుంది. అది నీకు తెలియకుండానే నిన్ను ఊబిలోకి నెట్టుతుంది. దావీదు ఊరియా భార్యయైన బత్షెబతో పాపము చేసి ఆమె భర్తను చంపించి బత్షెబను భార్యగా చేర్చుకున్నాడు. దావీదు చేసిన వ్యభిచార పాపము నరహత్యకు దారితీసింది. దావీదు చేసింది యెహోవా దృష్టికి దుష్కార్యముగా ఉంది. కాబట్టి ప్రవక్త అయిన నాతానును దావీదు నొద్దకు పంపిస్తాడు.

**'అయితే ఈ కార్యమువలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చునని దావీదుతో చెప్పి తన యింటికి వెళ్లెను.'** – 2 సమూ. 12:14,15

నాతాను ప్రవక్త వచ్చి దావీదును గద్దించడము, దావీదు బత్షెబకు జన్మించిన శిశువు మరణించడము, దేవుని ఉగ్రత, దావీదు మీదికి శిక్ష రావడము 2వ సమూయేలు 12వ అధ్యాయములో గమనిస్తాము. దావీదు ప్రవర్తన ద్వారా దేవుని నామము దూషించబడింది. నీ సత్ ప్రవర్తన ద్వారా దేవునికి మహిమ కలగాలి. దేవుని నామమునకు అపకీర్తి రాకూడదు. నీ ప్రవర్తన సరిచేసుకోవాలి. పాపము చేస్తే కఠినమైన శిక్ష వస్తుందని దావీదుకు తెలిసినా పాపము చేశాడు.

దావీదు దేవునియందు భయభక్తులు కలిగినవాడు. దేవుని హృదయానుసారుడు. దేవుడు దావీదును ఎంతో హెచ్చించాడు. గొఱ్ఱెలదొడ్డి నుండి పిలిచి సింహాసనము మీద కూర్చోబెట్టాడు. దేవుడు చేసిన ఉపకారమంతా దావీదు ఒక్క క్షణములో వ ం ర చి పో ం ు ు పాపము చేశాడు. పొరుగువాని భార్యను ఆశించడము, నరహత్య చేయడము పాపమని తెలిసినా పాపమునకు దాసుడై దేవుని శిక్షకు పాత్రుడయ్యాడు. సాతానుడు మోసగాడు. వాడు యుక్తితో నీ యొద్దకు వచ్చి నిన్ను పాపమునకు ప్రేరేపిస్తాడు. దేవుడు చేసిన మేలులన్ని మరచిపోయేలా చేసి చేయరాని హేయ కార్యములను చేయిస్తాడు. దాని వలన వచ్చే చేదు ఫలమును నీవు అనుభవించవలసి వస్తుంది. దేవుడు పాపములను క్షమిస్తాడు. గాని పాపము చేయడము వలన వచ్చే చేదు ఫలము జీవితాంతము అనుభవించవలసి వస్తుంది. దావీదు బత్షెబతో పాపము చేసి, బిడ్డ మరణము చూసాడు. కన్న కుమారుడైన అబ్షాలోము తండ్రి మీద తిరుగబడుతున్నాడు. దావీదు జీవితమంతా యుద్ధము, పోరాటమే కనబడుతుంది. దావీదు అనేక సమస్యలు ఎదుర్కొన్నాడు. మరణ భయముతో పారిపోయి గుహలలో దాగియున్నాడు. దేవుడు దావీదు పాపము క్షమించాడు గాని పాపము యొక్క శిక్షగా చేదుఫలము జీవితమంతా అనుభవించాడు.

**'మనము సత్యమునుగూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసిన యెడల పాపములకు బలి యికను ఉండదు గాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురుచూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును.'** – హెబ్రీ 10:26,27

ఇలాంటి వాక్యములు చదివినప్పుడు నీకు దైవభయము కలగాలి. బుద్ధిపూర్వకముగా చేసే పాపములకు క్షమాపణ ఉండదు కావున పాపమును జయించుటకు దేవుని కృప, పరిశుద్ధాత్మ శక్తి కావాలని ప్రార్థించాలి. కొందరు మాకు దేవుడు తోడుగా ఉన్నాడు. దేవుడు మమ్మును ఎన్నుకున్నాడు. ఇంత సేవ చేస్తూ కొద్దిగా పాపము చేస్తే ఏమీ ఫర్వాలేదు. దేవుడు క్షమిస్తాడు. నన్ను శిక్షించడు ఎందుకంటే ఇది కృపాయుగమని అనుకుంటారు. ప్రియ విశ్వాసీ! ఇది కృపాయుగమే, దేవుడు నీ పాపమును క్షమిస్తాడు కాని పాపము యొక్క ఫలమును నిశ్చయముగా నీవు అనుభవించవలసిందే. దేవుని శిక్ష నీ మీదికి వస్తుందని తెలిసి పాపము చేయడానికి తెగించకు. కొన్ని పాపములు నిన్ను బలముగా పట్టుకొంటాయి. నీ ఆత్మీయ జీవితము పతనమైపోతుంది. పాపమునకు చోటివ్వకు. అది నిన్ను ప్రేరేపించినపుడు దేవుని సహాయముతో ప్రార్థనతో దానిని జయించాలి.

కొన్ని సంవత్సరముల క్రితం వార్తా పత్రికలో ఒక వార్త చదివాను. ఒక వ్యక్తి ఆఫీసు నుండి అలసిపోయి విశ్రాంతి తీసుకోవడానికి సమీపముగా ఉన్న ఒక పార్క్‌కు వెళ్లి ఒక బెంచి మీద కూర్చుని క్రింద ఉన్న నీళ్లలో కాళ్లు ఆడిస్తున్నాడట. ఆ నీళ్లలో దాగియున్న జలగ అతని కాలును పట్టి అతని శరీరములోని రక్తమంతా త్రాగేసింది. అతనికి నొప్పిగాని, స్పర్శగాని తెలియలేదు గాని కొంత సమయం తరువాత చనిపోయాడు. ఏమైందని ప్రక్కవారు వచ్చి చూస్తే జలగ అతని కాలును పట్టుకొని ఉంది. అలాగే కొన్ని పాపములు నిన్ను పట్టుకుంటాయి. నిన్ను మరణమునకు నడిపిస్తాయి. అందుకే నిన్ను ముంచివేసి పతనమునకు నడిపించే పాపములను యేసు నామములో వదిలిపెట్టి ఆయన సిలువ రక్త ప్రోక్షణ క్రిందికి వచ్చి పవిత్రులుగా మారిపోవాలి.

**'తన పొరపాటులు కనుగొనగలవాడెవడు? నేను రహస్యముగా చేసిన తప్పులు క్షమించి నన్ను నిర్దోషినిగా తీర్చుము.'** – కీర్తనలు 19:12

నీవు పరస్పరముగా అందరికి బాగానే కనబడుతున్నావు. అందరూ నిన్ను మెచ్చుకుంటున్నారేమో గాని నీ రహస్య జీవితము ఏలాగు ఉంది? నీవు రహస్యముగా చేసిన తప్పులు క్షమించి నిన్ను నిర్దోషిగా చేయుమని ప్రార్థించు. ప్రోక్షింపబడిన హృదయములతో నిర్మలమైన మనస్సాక్షితో ప్రభువును ఎదుర్కోవాలి. దురభిమాన పాపములో పడకుండా నీ సేవకుని ఆపుము, రహస్యముగా నేను చేసిన తప్పుల నుండి నన్ను నిర్దోషిగా చేయుము అప్పుడు నేను యథార్థవంతుడనై నిందారహితుడనగుదును. నేను ఇలాగే పాపము చేస్తూ ఉంటే అధిక ద్రోహినైపోయి శిక్షకు పాత్రుడనవుతాను. కాబట్టి నన్ను ఆపివేయుమని భక్తుడు ప్రార్థిస్తున్నాడు. రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్స్ పెడతాడు. ఎందుకంటే ప్రమాదములు జరుగకూడదని. అతి వేగముగా వెళ్లే వాహనములు స్పీడ్ బ్రేకర్ దగ్గర స్లో అయిపోతాయి. అలాగేననే నీ హృదయములో పాపముంచుకొని వేగముగా ముందుకు వెళితే ప్రమాదము తప్పదు జాగ్రత్త! దేవుని వాక్యము, ప్రార్థన అనే స్పీడ్ బ్రేకర్స్ ద్వారా నిన్ను నీవు సరిచూచుకొని ప్రమాదము తప్పించుకోవాలి.

దేవుడు యథార్థవంతులకు తోడుగా ఉంటాడు. నీ హృదయము లోపల బయట ఒకే విధముగా ఉండాలి. లోపల ఎదుటి వారి కీడు నాశిస్తు పైకి తియ్యగా మాట్లాడటము విశ్వాసికి తగదు. ఆయన అంతరంగములో సత్యము కోరుకొనే దేవుడు. నీవు శుద్ధమైన తలంపులు కలిగియుండాలి. దేవుడైన యెహోవా అబ్రాముతో – **'నేను సర్వశక్తిగ దేవుడను; నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము. నాకును నీకును మధ్య నా నిబంధనను నియమించి నిన్ను అత్యధికముగా అభివృద్ధి పొందించెదనని అతనితో చెప్పెను.'**

– ఆదికా. 17:1,2

దేవుడు నిన్ను ఆశీర్వదించి, అభివృద్ధి చెందించాలంటే నీవు సర్వశక్తిగల దేవుని సన్నిధిలో నిందారహితముగా నడుచుకోవాలి.

నా నోటి మాటలు నా హృదయ ధ్యానము నీకు అంగీకారముగా ఉండాలని దావీదు ప్రార్థన చేస్తున్నాడు. కొందరు ఉపవాస ప్రార్థనలో ఉన్నామంటారు గాని నాలుకను నియంత్రణలో ఉంచుకోరు. అతిగా మాట్లాడుతారు. లేని వార్తలు పుట్టిస్తారు. దైవభయము లేకుండా మంచి చెడు ఆలోచించకుండా నాలుక ద్వారా మాట్లాడటము వలన కుటుంబములు విచ్ఛినమవుతాయి. కాబట్టి మాట నోటికి రాకమునుపు మూడు ప్రశ్నలు వేసుకోవాలి. ఇది న్యాయమా? అవసరమా? సత్యమా? అని ఆలోచించి నీ నోరు తెరవాలి. నీ నోటి మాటలను బట్టి లోకము నిన్ను తీర్పు తీరుస్తుంది. నీ మాటల ద్వారా ఇతరులు ఆదరింపబడాలి గాని ఎవరికీ కీడు కల్పించకుడదు.

**'యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకారదృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదము లును లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడను.'** – సామెతలు 6:16-19

విశ్వాసులు యేసు రక్తములో కడుగబడినవారు. దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన స్వాస్థ్యము గనుక నోటి మాటలు హృదయధ్యానము ఎల్లప్పుడును దేవునికి అంగీకారముగా ఉండాలి. దేవునికి విరోధముగా ఉన్న ప్రతి ఆలోచనను చెరపట్టాలి. నీవు ఏమైతే ఆలోచిస్తావో అదే క్రియా రూపము దాల్చి నిన్ను నడిపిస్తాయి. అందుకే పౌలు భక్తుడు కొరింథీ సంఘమునకు ఈ విధముగా వ్రాస్తున్నాడు.

**'మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి మీరు సంపూర్ణ విధేయతను కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతిదండనచేయ సిద్ధపడి యున్నాము.'**

– 2 కొరింథీ 10:5,6

నిన్ను పాడుచేసే పాపపు ఆలోచన నీకు కలుగగానే వెంటనే ప్రార్థన ద్వారా యేసు నామములో దానిని అణచివేయాలి. ఇంటిలో ఎలుకలుంటే అవి మనకు హాని కలిగిస్తాయని వాటిని ఎంతో ప్రయత్నించి పట్టుకొని చంపిస్తాము. అలాగే నీకు కీడు కలిగించే పాపము నిన్ను ప్రేరేపిస్తే ఆ ఆలోచనలను చెరపట్టాలి. పరిశుద్ధాత్ముడు ఎప్పుడూ నీతో మాట్లాడుతుంటాడు. ఇది మంచిది కాదు. ఈ పని నీకు తగదు. దీని ద్వారా నీకు కీడు వాటిల్లుతుంది అని నిన్ను హెచ్చరిస్తున్నప్పుడు ఆ స్వరమునకు లోబడి పాపపు తలంపులను ప్రతి నీచకార్యమును వదిలిపెట్టాలి.

**ప్రార్థన :** ప్రతి ఉదయము లేకగానే దేవా, నన్ను పవిత్రపరచు, నా నోటి మాటలు, నా హృదయ ధ్యానము నీకు అంగీకారముగా ఉండాలి. నేను దురభిమాన పాపములో పడకుండ నన్ను ఆపివేయి. నీ సన్నిధిలో నిందారహితముగా, యథార్థహృదయముతో నడుచుటకు సహాయము చేయి, నీ రక్తప్రోక్షణ క్రిందికి వస్తున్నాను. ఏ పాపము నన్ను లొంగదీసుకోకుండా నాకు సహాయము చేయుమని ప్రార్థించాలి. నీకు అయిష్టమైన ప్రతి తలంపును ఆలోచనను జయించి పవిత్రముగా జీవించుటకు నీ కృపాసహాయము దయచేయుమని ప్రార్థించాలి.

**'మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును.'**

–1యోహాను 1:9

హెచ్చరిక : హృదయములో గర్వము అహంకారము కలిగి నాకు అన్నీ తెలుసు, నేను రక్షింపబడి బాప్తిస్మము తీసుకున్నాను. దేవుడు నాకు తోడుగా ఉన్నాడు. నేను పాపము చేస్తాను, అడగడానికి నీవెవరు? అన్నీ చెల్లిపోతాయనుకుంటూన్నావా జాగ్రత్త! దేవుని వేటు నీ మీద పడుతుంది.

**'ఎన్ని సారులు గద్దించినను లోబడనివాడు మరి తిరుగులేకుండ హఠాత్తుగా నాశనమగును.'**

– సామెతలు 29:1

**అందుకే దైవభయము కలిగి పాపమునకు దూరంగా జీవించాలి.**

## లోకోక్తులు

- నిజాయితీగల సేవలో నుండియే అధికారం పుట్టుకు వస్తుంది - గాంధీజీ
- ఈ ప్రపంచం మనిషి అవసరాలను తీర్చగలదు కాని కోర్కెలను ఎప్పటికీ తీర్చలేదు -గాంధీజీ
- అనంతములైన రెండు కాలాల మధ్య తళుక్కున మెరిసే కాంతి కిరణమే జీవితం -కార్లయిల్
- ఉత్తమమైన విద్య అంటే సమాచారాన్ని అందించడం కాదు. పరిసరాలకు అనుగుణంగా జీవించేలా చేయటం. -రవీంద్రనాథ్ ఠాగూర్

# విశ్వాసి - విధేయత



**వివేకవతి.జో.**
అధ్యక్షులు
తెలుగు బాప్టిస్ట్ సంఘం
నెల్లిమర్ల

**ఆ**యన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను. (హెబ్రీ5:8)

యేసు సర్వమానవాళికి విమోచన మార్గం చూపడానికి తన మహిమను వదలి ఇహలోకంలో అవతరించాడు. మనలను శాపంనుండి విమోచించడానికి తాను బలి పశువుగామారి. విమోచనా కార్యక్రమాన్ని పూర్తిచేసాడు. వినమ్రతతో ప్రతివిషయంలోను తండ్రి చిత్తాన్ని అన్వేషించాడు, లోబడుటను మనకునేర్పాడు. దేవుని కుమారునిగా మనలను పాపవిముక్తులనుగజేసి విమోచన గావించాడు. అంతేకాని ఆయన దేవుని కుమారుడిగ కావడానికి కాదు. మనల్నిలోబడమని మనపై వత్తిడిని కలుగజేయడు. లోబడడం, లోబడపోవడం అనేది మన అంతరాత్మపై ఆధారపడి ఉంటుంది. మన దైనదిన జీవితంలో మనం ఇతరులకు లోబడవలసి అనేక సందర్భాలు ఎదురౌతాయి. అప్పుడే మన విధేయత వెల్లడౌతుంది. అయితే ఆయనయందు మన జీవం దాచిపెట్టబడియున్నది. ఆసత్యాన్ని ఆయన కృపాసహితమైన మూర్తి మంత్వాన్ని గ్రహించినపుడు యేసు విధేయతకు మారుపేరని నిజస్వరూపం ఆయనలో ఉందనే నిగూఢమైన భావాన్ని గ్రహించగలుగుతాం. అప్పుడు ఆయన చూపిన విధేయత మన అవిధేయతను గుర్తు చేస్తుంది. ఆయన చూపిన కృప మన హృదయాంతరాళము లోనికి చొచ్చుకొని పోతుంది. అప్పుడు మనంతట మనమే ఆయన ఆధిపత్యానికి లోబడాలనే హృదయ స్పందనకు లోనౌతాము. మన విధేయత వలన ఎదుటి వారికి చైతన్యం రావాలి. అదే నిజ విశ్వాసిలోని వినమ్రత. మన దైనందిన కార్యక్రమాల్లో చిన్న చిన్న విషయాల్లో మనం అహంతో విఱ్ఱవీగుతుంటాం. ఆ అహమే శుద్ధాత్మని కాపుదలకు అడ్డుబండగా తయారవుతుంది. బలహీనులుగా నిస్సహాయులుగా తయారు చేస్తుంది. అలా అని 'శుద్ధాత్ముడు' మనలను అర్థాంతరంగా వదలి అంతర్ధానమైపోడు. అదే తండ్రి, తనయ, శుద్ధాత్ములోని అన్యోన్యత. అంతటి మహాద్భాగ్యము మన చెంతనే ఉంది. అనుదినం ఆయన పాదాల చెంత చేరి మన అంతరంగం స్వభావాల్ని ఆయన ముందర పరచుకొని శుద్ధిచేసుకోవాలి. ఆయన తన వెలుగులో మన అంతరాత్మను పరిశోధించి చూస్తాడు. తన కృపను విస్తరింప జేస్తాడు. "నీవువెళ్లి నీ సహోదరునితో సమాధానపడు" అన్న ప్రభుని వాక్కు. మనలో ప్రేరేపణకల్గిస్తుంది. అదే మనం సమాధాన పడడానికి నాందిపల్కుతుంది. ప్రభువుకు మనం చూపించే విధేయత అదే. అప్పుడు మనం ఆనందంగా ఉండగల్గుతాము. మన విధేయత క్రీస్తు ప్రేమను వెల్లడి చేసేదిగా చిగురించి వృద్ధిపొందాలని ప్రభుని వేడుకొందాం అనునిత్యం.

## ఎవరైనా మీ బైబిలు లో తప్పులున్నాయంటే... తగు జవాబులతో వివరించి ఒప్పించాలి. అంతేగాని మీ గ్రంథాల్లోనూ తప్పులున్నాయనుట భ్రష్టత్వానికి పరాకాష్ట!

**మ**న కుటుంబికుల ప్రవర్తనల్లో ఎవరైనా పొరబాట్లున్నట్లు భావించి మనకు తెలిపితే అవి సద్విమర్శలుగా స్వీకరించాలి. అందుకు తగ్గ వివరణతో ఆయా ప్రవర్తనల్లో చెడు లేకుంటే లేదని చెప్పాలి. వారు అపోహపడ్డారని నిరూపించగలగాలి. అది సంస్కారుల లక్షణం. అంతేగాని వారిని పట్టుకొని మీలోను, మీ కుటుంబికుల్లోను అంతకు మించిన పొరబాట్లున్నాయి అని ఎదురు చెప్పుట కుసంస్కారం. వారికి అది కోపోద్రేకాన్ని కల్గిస్తుందేగాని మనయెడల సద్భావం కల్గించదన్నది ఎరుగుటయే విజ్ఞుల లక్షణం. మనల్ని ప్రశ్నించిన ఎదుటివారిని చిరునవ్వుతో పలుకరించి మన కుటుంబ సాక్ష్యాన్ని నిరూపించుకొనుటే శ్రేయస్కరం. నిరూపించుటకు మన సాక్ష్యం లోకంలో బాగుండాలి. ఎప్పుడూ అలా ఆలోచించండి! మన కుటుంబాల గురించే ఆ విధంగా చెబుతూ ఒప్పిస్తుంటే.. మరి దేవుని గురించి ఇంకెంతలా చెప్పిలి? ఒప్పించాలి? ఆలోచించాలి! వాక్యాన్ని నిరూపించే వారందరూ వాక్యంకోసం పోరాడండి అన్న దేవుని మాటను నెరవేరుస్తున్నవారే. అందు మనందరం ఉండాల్సిందే! బైబిల్లో తప్పులున్నాయంటే వారు ప్రశ్నించే వాటిని విని తగు వివరణ ఇవ్వాలి. బైబిల్లో వ్రాయబడి ప్రపంచానికి తెలియబడుతున్న తండ్రియైన దేవునిలోను, మన ప్రభువైన యేసుక్రీస్తులోను ఎటువంటి తప్పులు లేవుగా! వారి మహోన్నతత్వం వివరించుటకు సంకోచమెందుకు? బైబిలు చదువని వారికి, చదివింది గ్రహించని వారికి అన్నీ సంకోచాలే. కాబట్టి వారు చెప్పలేరు. క్రైస్తవనాడు పాఠకులు అలా కారాదనే మా ఆకాంక్ష. అందుకోసమే బైబిల్లో గల అనేక సంగతులను వివరించుటకై క్రైస్తవనాడు మొదట్నుంచి బహు సంతోషంతో సంకల్పించింది. ఆ సంకల్పాన్ని సంపూర్ణంగా నెరవేర్చుకోవాలంటే యేసు దగ్గరకే వెళ్లాలని మత్తయి 11:28లో చూడగలం. అందుకే ప్రతి ప్రశ్నకు యేసు (వాక్యం) నొద్దకు క్రైస్తవనాడు వెళ్తుంది. 'నా దగ్గరకు వచ్చి నేర్చుకొనుడి' అని యేసుక్రీస్తువారే అభయమిచ్చారు. బైబిలు చదువుతూ ధ్యానిస్తుండగా గ్రహింపును ఇచ్చేది ఆయనే. అది మా యెడలనూ నెరవేరుస్తున్న 'దేవునికి స్తోత్రము'.

<u>దైవోక్తి:</u> నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించు -యేసుక్రీస్తు. <u>లోకోక్తి:</u> ప్రేమతో ఇతరుల హృదయాలను జయించండి. -స్వామి చంద్రశేఖర సరస్వతి

# అకారాది వాడుక శబ్దార్థాలు

బ్రదర్ ఎస్.ఆర్. తిరుగుళ్ళ., చర్చ్ ఆఫ్ క్రైస్ట్.
చీపురుపల్లి, విజయనగరం జిల్లా.



| బైబిల్ పదము | అర్థము |
|---|---|
| అబ్రహాము (ఆది కాం.17:5) | సమూహమునకు తండ్రి |
| ఆదాము (ఆది కాం. 2:9) | ఎర్రని |
| ఇశ్రాయేలు (ఆది కాం. 32:28) | దేవుని బంటు |
| ఈజరు (సంఖ్యా 26:29) | సహాయము |
| ఉజ్జీయా (1దిన వృ. 11:44) | యెహోవాయే నా బలము |
| ఊజు (యోబు 1:1) | స్థిరము |
| ఋణము (కొలస్సీ 2:13-15, రోమా 1:14) | అప్పు; ఆజ్ఞలను, విధులను మీరుట |
| ఎలీషా (1రాజులు 19:16) | దేవుడే రక్షణయైన వాడు |
| ఏలీయా (1రాజులు 17:1) | యెహోవా నా దేవుడు |
| ఐనోను (యోహాను 3:23) | ఊటలు |
| ఒత్నీయేలు (యెహో. 15:17) | దేవుని శక్తి మంతుడు |
| ఓబద్యా (ఓబ. 1వ.) | దేవుని ఆరాధించువాడు |
| ఔగుస్తు (లూకా 2:1) | పూజనీయుడు |
| అంద్రెయ (మత్తయి 10:2) | పౌరుషము గలవాడు |
| కనాను (ఆది కాం.9:18) | పల్లమైన ప్రదేశము |
| ఖజానా దారుడు (ఎజ్రా 1:8;7:21,రోమా16:23) | ధనాగారమంతటిపై అధిపతి/ గృహనిర్వాహకుడు |
| గబ్రియేలు (దానియేలు 8: 16) | దేవుని మనిషి |
| ఘనత వహించిన (లూకా 1:1) | గౌరవనీయులగు |
| జ్ఞాని (దానియేలు 2:12-14) | దైవజ్ఞానమునభ్యసించిన విద్వాంసుడు |
| చతుష్టయము (అపో.కా. 12:4) | ఖైదీలను కాచియుండు నలుగురు రాణువ వారి గుంపు |
| చలువరాయి (1దిన వృ. 29:2) | ఒక తరహా సున్నపురాయి |
| జక్కయ్య (లూకా 19:1-10) | పవిత్రుడు |
| టల్మోను (1దిన వృ. 9:17) | బాధింపబడువారు |
| తబితా (అపో.కా. 9:36) | జింక |
| థెయొఫిల (లూకా 1:1) | దేవ ప్రియుడు |
| దర్యావేషు (దానియేలు 5:31) | రాజు |
| ధన్యవాక్యములు (మత్త 5:3-12,లూకా 6:20-23) | దీవెన వచనములు |
| నతనయేలు (యోహాను 1:45) | దేవుని బహుమానము |
| పనూయేలు (లూకా 2:36) | దేవుని సముఖము, దేవుని దర్శనము |
| ఫరో (2రాజులు 23:29; యిర్మీ 44:30) | మహా వంశము |
| బర్నబా (అపో.కా. 4:36) | హెచ్చరిక చేయువాడు |
| భయభక్తులు (మత్త 10:28; లూకా 1:50..) | దేవునికి భయపడుట |
| మరియ (మత్తయి 1:16) | తిరుగుబాటు |
| యరోబాము (2రాజులు 13:13) | జనులు విస్తరింతురు |
| రబ్బీ (మత్తయి 23:7) | బోధకుడు |
| లాజరు (లూకా 16:20) | దేవుడు సహాయము చేయువాడు |
| వందనములు (రోమా 16:16) | సుభములు (సలాము) |
| సమూయేలు (1సమూ. 1:20) | దేవుడు ఆలకించెను |
| శారా (ఆది కాం. 17:15) | రాణి |
| షద్దాయి (సంఖ్యా 1:6) | సర్వశక్తి గల |
| హవ్వ (ఆది కాం. 3:20) | జీవము |
| క్షమాపణ (కీర్తనలు 32:1; 78:3) | ప్రాయశ్చిత్తము నొందుట |

<u>నాడు :</u> పరిచర్య కోసం అపొస్తలులకు ఇవ్వబడిన సొమ్మును వారు అక్కడున్నవారికి అక్కర కొలది 'పంచిరి'. ఇది నాడు వారి నిస్వార్థ పరిచర్యకు రుజువు.

<u>నేడు :</u> పరిచర్య కోసం సేవకులకు ఇవ్వబడుతున్న సొమ్ములతో ఎవరి 'సామ్రాజ్యాలను' వారు నిర్మించుకో జూస్తున్నారు. నాడు సొమ్మును అపొస్తలులు 'పంచిరి'... నేడు ఈ సేవకులు ఆ సొమ్ములను తమ కోసమే 'ఉంచిరి' అని విశ్వాసులు పరిర్యలోగల తేడాను గురించి చర్చోపచర్చలు గావించుకుంటున్నారు. ఇది నేడు వీరి స్వార్థపూరిత పరిచర్యకు రుజువు. -బ్రదర్ వైకెయార్



Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 18-441/5, Laxmi Swathi Residency, 204, Santha Palem, China Gadili, Old dairy farm (Po), Visakhapatnam - 530 040, Andhra Pradesh. Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, China Gadili, Visakhapatnam - 40.